IRS PUBLICATIONS
e-mail: irspublications123@gmail.com
https://epaper.suryavastavam.com

Truth of News
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

మంగళవారం | 18 జూన్ 2024 | తిరుపతి

సంపుటి 1 | సంచిక 14
పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Tirupati, Guntur, Nellore, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


వైనాడ్ నుండి ప్రియాంక గాంధీ పోటీ

# పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు: చంద్రబాబు





పోలవరం జూన్ 17 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు అనేక సంక్షోభాలను ఎదుర్కొందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్పిల్‌వే, కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్ పనుల పురోగతి వివరాలను జలవనరుల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మీడియాతో చంద్రబాబు మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టు కోసం నేను పడిన కష్టాన్ని జగన్ బూడిదలో పోసిన పన్నీరు చేశారు. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి ఆటంకాలు రాకూడదనే ఉద్దేశంతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేలా ఆనాడు కేంద్రాన్ని ఒప్పించాను. ప్రాజెక్టు మొదలు పెట్టిన దగ్గర నుంచి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. జాతీయ ప్రాజెక్టుగా విభజన చట్టంలో చేర్చడంతో తెదేపా హయాంలోనే 72 శాతం ప్రాజెక్టును పూర్తి చేశాం. 15 లక్షల క్యూసెక్కులు స్పిల్ వేపై డిశ్చార్జ్ అవుతాయి" "రాజకీయాల్లో ఉండదగని వ్యక్తి వచ్చి రాష్ట్రానికి శాపంగా మారారు. వైకాపా ప్రభుత్వం రాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టారు. ఏజెన్సీతోపాటు సిబ్బందినీ మార్చారు. డయాఫ్రమ్ వాల్‌ను గత ప్రభుత్వం కాపాడుకోలేదు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు. ఈ ప్రాజెక్టుపై నేను వందసార్లు సమీక్షించా.. 30 సార్లు సందర్శించా. రూ.446 కోట్లతో మరమ్మతులు చేసినా బాగవుతుందనే పరిస్థితి లేదు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గతంలో ప్రాజెక్టు నిర్మాణం 2లో

# గర్భిణీలు,చిన్నారులు,గిరిజనుల్లో పౌష్టికాహారలోప నివారణకు పటిష్ట చర్యలు

– గిరిజన ప్రాంతాల్లో అవసరమైన చోట్ల ఫీడర్ అంబులెన్సులను ప్రవేశపెడతాం : రాష్ట్ర గిరిజన,మహిళా శిశు సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి



అమరావతి జూన్ 17 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గర్భిణీలు, చిన్నారులు, గిరిజనులు పౌష్టికాహార లోపంతో ఏఒక్కరూ చనిపోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.ఈమేరకు సోమవారం రాష్ట్ర సచివాలయం మూడవ భవనంలో ఆమె రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారులు సరిగాలేని అంబులెన్సులు వెళ్లడానికి అవకాశం లేని చోట్ల ఫీడర్ అంబులెన్సులను(ద్విచక్ర వాహన)తిరిగి ప్రవేశ పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గత ఐదేళ్ళ కాలంలో మారుమూల గిరిజన ప్రాంతాల్లో ఎవరికైనా అనారోగ్యం వస్తే వారిని మనుషుల భుజాలపైన లేదా డోలీలపై మోసుకుని రావడం నిత్యం మనం మీడియాలో చూస్తున్నామని అన్నారు.ఇకపై అలాంటి పరిస్థితి లేకుండా ఫీడర్ అంబులెన్సులను అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు.గర్భిణీలు,చిన్నారులు లేదా గిరిజన ప్రాంతాల ప్రజలు ఎవరూ పౌష్టికాహార లోపంతో చనిపోకుండా నివారించేందుకు ఈప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ఎఎన్ఎంలు అందుబాటులో ఉండేవారని కాని గత ప్రభుత్వం ఆవిధానానికి స్వస్తి చెప్పడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కావున వారి ఆరోగ్య పరిరక్షణకు 544 ఎఎన్ఎంలను ఆశ్రమ పాఠశాలల్లో నియమించేందుకు తగిన దస్త్రంపై మంత్రి సంధ్యారాణి తొలి సంతకం చేశారు.గతంలో సాలూరు నియోజకవర్గంలో దేశంలోనే గుర్తింపు పొందిన గిరిజన గర్భిణీల స్త్రీల వసతి గృహం ఉండేదని గుర్తు చేశారు.మరలా అలాంటి వసతి గృహాలను వివిధ గిరిజన ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.త్వరలో ఐటిడిఏలు, ఐసిడిఎస్ ప్రాజెక్టులను పూర్తిగా ప్రక్షాళన చేసేందుకు చర్యలు తీసుకుని తద్వారా ప్రజలకు ముఖ్యంగా గిరిజనులు,మహిళలకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి సంధారాణి స్పష్టం చేశారు. 2లో

# ఆరోగ్యశాఖలో అవకతవకలపై విచారణ

## రుయా ఆస్పత్రిని సందర్శించిన మంత్రి సత్యకుమార్



తిరుపతి,జూన్ 17 (సూర్య వాస్తవం) : ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. వైద్యారోగ్య శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో నాడు-నేడు, ఆరోగ్యశ్రీలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్య కళాశాలల ఏర్పాటులో అప్పటి ప్రభుత్వం నిబంధనలు పాటించలేదని ఆరోపించారు. 'గత ప్రభుత్వంలో జరిగిన తప్పులన్నీ సరి చేస్తాం. వైద్యంలో రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతాం. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స, నివారణకు చర్యలు తీసుకుంటాం. వైద్యారోగ్య శాఖ సిబ్బంది సంక్షేమ, ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం. ఎయిమ్స్ తరహాలో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యానికి చర్యలు తీసుకుంటాం' అని సత్యకుమార్ తెలిపారు. రుయా ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా మార్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఆరోగ్యశ్రీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపిస్తామన్నారు. గత ప్రభుత్వంలో వైద్య, ఆరోగ్య శాఖలో అవినీతికి పాల్పడ్డ ఏ ఒక్కరిని వదిలిపెట్టబోమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు అవసరమైన సహకారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ప్రక్షాళన దిశగా ముందుకెళుతున్నామని సత్యకుమార్ తెలిపారు. రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఖచ్చితంగా చర్యలు ఉంటాయని సత్యకుమార్ అన్నారు. రుయా ఆసుపత్రిలో ఎక్స్‌రే మిషన్లు పాతవేనన్నారు. ఓపి కోసం గంటల తరబడి రోగులు వేచి చూడాల్సి వస్తోందన్నారు.


# గంజాయి విక్రయాలకు చెక్ పెడతాం

## –మంత్రి నారా లోకేశ్ వెల్లడి



అమరావతి జూన్ 17 (సూర్య వాస్తవం) : రాబోయే 100 రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి విక్రయాలకు చెక్ పెడతామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రజా దర్బార్‌ను అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా మంగళగిరి ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం లోకేశ్ మీడియాతో మాట్లాడారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 2లో

# త్యాగానికి మారుపేరు బక్రీద్ : మంత్రి ఫరూక్



అమరావతి జూన్ 17 (సూర్య వాస్తవం) : త్యాగ నిరతికి, అల్లాహ్‌పై విశ్వాసానికి ప్రతీకగా బక్రీద్ పండుగ (ఈద్ ఉల్ ఆదా) అని న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక భీమవరం రూట్ లో ఉన్న ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశం అన్నారు . ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ బక్రీద్ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు.

# తొత్తులుగా వ్యవహరించిన వారు వెళ్లిపోవచ్చు

## సింహాచలం అప్పన్న సేవలో మంత్రి వంగలపూడి అనిత



సింహాచలం,జూన్ 17 (సూర్య వాస్తవం) : గత ప్రభుత్వంలో కొందరు పోలీస్ అధికారులు దురుసుగా ప్రవర్తించారని, స్వామి సేవలో తరించారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. అలాంటి వారు మారాలని లేకుంటే ఉద్యోగం వదిలి వెళ్లాలని అన్నారు. ఇకపోతే రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరగాలని సింహాద్రి అప్పన్న స్వామిని కోరుకున్నానని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహాచలంలో స్వామి వారిని ఆమె దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అనిత మీడియాతో మాట్లాడారు. మంత్రి 2లో

మొదటి పేజీ తరువాయి

## పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పులు చేశారు: చంద్రబాబు

కొనసాగి ఉంటే 2020 చివరినాటికి పూర్తయ్యేది. పోలవరం పూర్తికి నాలుగు సీజన్లు కావాలని అధికారులు చెబుతున్నారు. అన్నీ సవ్యంగా జరిగితేనే నాలుగేళ్లు పడుతుందని అధికారులు అంటున్నారు" "ఎలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదో ఇదొక కేస్ స్టడీ. రూ.వేల కోట్ల ప్రజాధనం వృథా అయ్యింది. అప్పుడే ప్రాజెక్టు చేపడితే తక్కువ ఖర్చుతో పూర్తయ్యేది. ప్రస్తుతం ప్రాజెక్టు వ్యయం పెరిగింది. నష్టం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీని మార్చవద్దని కేంద్రం రాష్ట్రానికి చెప్పింది. అలా మార్చితే ప్రాజెక్టుకు జవాబుదారీతనం ఉండదని చెప్పారు. ఏజెన్సీలను మార్చడమే ప్రాజెక్టు ఆలస్యానికి కారణం. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు?. ప్రజలనే కాదు, మీడియాను, ప్రతిపక్ష నేతగా నన్ను కూడా ఇక్కడికి రానీయలేదు. ప్రస్తుతం ప్రాజెక్టు అంతా క్లిష్టంగా మారిపోయింది. ఈ చిక్కుముడులు అన్నీ విప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రాజెక్టు ద్వారా నదులు అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు నీరు ఇవ్వాలని కలలు కన్నా. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి చెందిన ప్రాజెక్టు ఇది" అని అన్నారు.

## గర్భిణీలు,చిన్నారులు,గిరిజనుల్లో పౌష్టికాహారలోప నివారణకు పటిష్ట చర్యలు

గిరిజన ప్రాంతాల్లో విద్య,వైద్యం,తాగునీరు,రహదారులు,పౌష్టికాహార లోప నివారణ వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి వాటిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవడం జరుగుతుందని గిరిజన మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలో చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.గత ఐదేళ్ళ కాలంలో గిరిజనులు, మహిళలు ఎదుర్కొన్న సమస్యలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ మరియు డైరెక్టర్ జెవి మురళి,గురుకుల సొసైటి కార్యదర్శి సదా భార్గవి,గిరిజన సంక్షేమశాఖ ఇఎన్సి శ్రీనవాస్,ఎండి జిసిసి సురేశ్ తదితర అధికారులు మంత్రి సంధ్యారాణికి పుష్ప గుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఇంకా ఈకార్యక్రమంలో పలువురు గిరిజన సంక్షేమం,స్త్రీశిశు సంక్షమ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయాలకు చెక్ పెడతాం

కూడా ముగ్గురు తెదేపా కార్యకర్తలను వైకాపా నేతలు హత్య చేసినా సంయమనం పాటిస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు నడుచుకుంటున్నామని చెప్పారు. తమ కార్యకర్తలకు ఆగ్రహం వ్యక్తం చేస్తే వాళ్లు ఎక్కడ ఉంటారో తెలుసుకోవాలన్నారు. రుషికొండ ప్యాలెస్ వ్యవహారంలో ఇంకా బయటికి రావాల్సిన చిత్రాలు చాలా ఉన్నాయని వ్యాఖ్యానించారు. మంగళగిరి ప్రజల కోసం మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్'కు అనూహ్య స్పందన లభిస్తోంది. గత రెండు రోజులుగా ఆయన ప్రజా దర్బార్ పేరిట ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా నియోజకవర్గానికి చెందిన ప్రజలు ఉండవల్లిలోని ఆయన నివాసానికి తరలివచ్చి తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. జీతాలు పెంచాలని అంగన్వాడీ టీచర్లు, బదిలీల కోసం ఉపాధ్యాయులు, ఉపాధి కల్పించాలని నిరుద్యోగులు ఆయనకు విన్నవించారు. విద్య, వైద్య ఖర్చులకు సాయం అందించాలని పలువురు కోరారు. వైకాపా నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని భూములను బలవంతంగా లాక్కున్నారని, తమకు న్యాయం చేయాలని పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. అందరి సమస్యలను ఓపికగా విన్న లోకేశ్... సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతామంటూ వారికి భరోసా ఇచ్చారు.

## తొత్తులుగా వ్యవహరించిన వారు వెళ్లిపోవచ్చు

పదవి వచ్చిన తర్వాత అప్పన్న స్వామిని దర్శించుకోవాలని ఇక్కడికి వచ్చానని తెలిపారు. సింహాచలం దేవస్థానం భూములు ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా చూస్తానన్నారు. పంచగ్రామాల భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వైకాపా ప్రభుత్వంలో కొంతమంది పోలీసు అధికారులు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా పనిచేశారని అనిత విమర్శించారు. ఇప్పటికీ వారిలో వైకాపా రక్తం ప్రవహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌పై ఇంకా ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీ కోసం పనిచేసుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతల విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తానని తెలిపారు.

# జమ్మూ ఎన్నికల ఇంచార్జీగా కిషన్



శ్రీనగర్, జూన్ 17 (సూర్య వాస్తవం) : లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యాయి. మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ రెండు చోట్లా బీజేపీయే గెలిచింది. మరి కొద్ది నెలల్లో మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్‌తో పాటు జమ్మకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. హైకమాండ్ ఈ ఎలక్షన్స్‌పై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టింది. ఆయా రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను నియమించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన చేసింది. మహారాష్ట్రకు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా భూపీందర్ యాదవ్‌ని, కో ఇన్‌ఛార్జ్‌గా అశ్వినీ వైష్ణవ్‌ని నియమించింది. హరియాణాలో ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా ధర్మేంద్ర ప్రదాన్‌తో పాటు బిప్లవ్ కుమార్ ఎంపికయ్యారు. ఝార్ఖండ్‌లో ఎన్నికల ఇన్‌ఛార్జ్ పదవిని శివరాజ్ సింగ్ చౌహాన్‌కి అప్పగించింది హైకమాండ్. ఆయనతో పాటు హిమంత బిశ్వ శర్మకీ ఈ బాధ్యతలు కట్టబెట్టింది. జమ్మకశ్మీర్‌కి తెలంగాణ బీజేపీ నేత జి కిషన్‌రెడ్డిని నియమించింది అధిష్ఠానం. ఇటీవలే కిషన్ రెడ్డికి కేబినెట్‌లోనూ చోటు కల్పించింది. బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఆయన ఈ మధ్యే బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పుడు మరో కీలక బాధ్యతనూ అప్పగించింది బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ. జమ్మకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ఇటీవలే సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. త్వరలోనే జమ్మకశ్మీర్‌లో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వం ఏర్పాటవుతుందని సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. చివరి సారి అక్కడ 2014లో ఎన్నికలు జరిగాయి. బీజేపీ, పీడీపీ కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ముఫ్తీ మహమ్మద్ సయీద్ సీఎం బాధ్యతలు తీసుకున్నారు. 2016లో ఆయన చనిపోయాక కూతురు మెహబూబా ముఫ్తీ ఆ పదవిని చేపట్టారు. ఆ తరవాత బీజేపీ కూటమి నుంచి బయటకు వచ్చింది. ముఫ్తీ సీఎం పదవికి రాజీనామా చేశారు. 2019 ఆగస్టులో జమ్మకశ్మీర్‌కి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం రద్దు చేసింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, హరియాణాలో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. జమ్మకశ్మీర్‌లో మాత్రం ఈ సంవత్సరమే ఎన్నికలు జరుగుతాయి.

# బెంగాల్ లో ఘోర రైలు ప్రమాదం... 10కిచేరిన మృతులు



బెంగాల్, జూన్ 17 (సూర్య వాస్తవం) : పశ్చిమబెంగాల్ లో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. గూడ్స్ రైలు కాంచన జంగ ఎక్స్ ప్రెస్‌ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారని ప్రాథమికంగా అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది. డార్జిలింగ్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అసోంలోని సిల్చార్ నుంచి వస్తున్న కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ని రంగపాని స్టేషన్ వద్ద గూడ్స్ ట్రైన్ ఢీకొట్టింది. బలంగా ఢీకొట్టడం వల్ల బోగీలు ఒకదానిపై ఒకటి ఎక్కాయి. ఈ ప్రమాదంలో కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన రెండు కోచ్‌లు అదుపు తప్పాయి. ఈ ఘటనపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రమాద ధాటికి బోగీలు చెల్లాచెదురయ్యాయి. అయితే...ఈ ప్రమాదంలో చాలా మంది గాయపడ్డారని, పలువురి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోకుండా వెళ్లిపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమికంగా అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఈ ప్రమాదంపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. ఈ ఘటనగ్ర్భాంతి కలిగించిందని వెల్లడించారు. రెస్క్యూ ఆపరేషన్స్ కొనసాగుతున్నాయని తెలిపారు. రైల్వేతో పాటు ఔఆఖీఈ,ాఆఖీఈ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. గాయపడ్డవారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద ఎమర్జెన్సీ మెడికల్ టీమ్ అందుబాటులోకి వచ్చింది. వేగంగా బాధితులను హాస్పిటల్‌కి తరలిస్తోంది. మార్గ మధ్యలోనే అవసరమైన చికిత్స అందిస్తోంది. ఇక రైల్వే అధికారులు ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. సాయం కావాల్సిన వాళ్లు హెల్ప్‌లైన్ నంబర్‌లకు కాల్ చేయాలని వెల్లడించారు. నైహతి స్టేషన్ వద్ద మరో స్పెషల్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.

# సిగ్నల్ పడినా పట్టని పైలెట్

బెంగాల్, జూన్ 17 (సూర్య వాస్తవం) : బెంగాల్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. కాంచనజంగ ఎక్స్‌ప్రెస్‌ని గూడ్స్ ట్రైన్ ఢీకొట్టిన ఘటనలో 5గురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం...మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముంది. 5 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. రెండు రైళ్లూ ఒకే ట్రాక్‌పై ఎలా వచ్చాయన్న దానిపైనే ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఓ ట్రాక్‌పై అప్పటికే కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ ఉండగా వెనక నుంచి వచ్చి గూడ్స్ ట్రైన్ ఢీకొట్టింది. అంటే...ఎక్కడో మిస్‌కమ్యూనికేషన్ జరిగి ఉంటుందన్నది ప్రాథమిక అంచనా.అయితే..దీనిపై అధికారులు విచారణ మొదలు పెట్టారు ప్రాథమికంగా ప్రమాదానికి కారణమేంటో వెల్లడించారు. డార్జిలింగ్ వద్ద గూడ్స్ ట్రైన్‌కి రెడ్ సిగ్నల్ పడింది. కానీ లోకోపైలట్ దాన్ని గమనించకుండా వెళ్లిపోయాడు. అప్పటికే ఆ ట్రాక్‌పై కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ ఉంది. ఫలితంగా రెండు రైళ్లూ ఒకే ట్రాక్‌పైకి వచ్చాయి. సిగ్నల్ జంప్ చేసి గూడ్స్ నేరుగా ఆ ఎక్స్‌ప్రెస్‌ని వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ధాటికి ఒక్కసారిగా బోగీలు చెల్లాచెదురయ్యాయి. ఎక్స్‌ప్రెస్ బోగీలు అదుపు తప్పాయి. ఒకదానిపై ఒకటి ఎక్కాయి. అయితే..ఇది ప్రాథమికంగా అధికారులు చెబుతున్న విషయం. దీనిపై ఇంకా పూర్తి స్థాయి విచారణ జరగాల్సి ఉంది.

# నీట్ పై స్పందించరేంటీ...




హైదరాబాద్, జూన్ 17 (సూర్య వాస్తవం) : నీట్ ఎగ్జామ్ 2024 వ్యవహారాన్ని బీఆర్ఎస్ అంత తేలికగా తీసుకోవడం లేదు. కష్టపడి చదివే తమ పిల్లలు కేంద్రం నిర్వహణ లోపంతో నష్టపోతున్నారని, తమ పిల్లలు డాక్టర్ కావాలని కలలు కన్న తల్లిదండ్రుల ఆశలపై నీట్ పరీక్షా వ్యవహారం నీళ్లు చల్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. బిహార్ లో 30 లక్షల చొప్పున నీట్ ఎగ్జామ్ పేపర్లు అమ్ముకున్నారని, ఇప్పటికే పదుల సంఖ్యలో అరెస్టులు జరుగియాని వార్తలొస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందంటూ మండిపడ్డారు. నీట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం మొదట్నుంచీ అత్యంత నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తోందని కేటీఆర్ విమర్శించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన నీట్ ఎగ్జామ్ (ఔఇఖ ఇలీజీఎ 2024) పై ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్నా ప్రధాని మోదీ ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోవడం దారుణమన్నారు. విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని నిర్వహించే ప్రధాని మోదీ.. కీలకమైన నీట్ ఎగ్జామ్ పై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు కేటీఆర్. నీట్ ఎగ్జామ్ నిర్వహణ, లోపాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. విద్యార్థులకు, లక్షలాదిమంది తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలని ఎన్డీయే సర్కార్ కు రాసిన లేఖలో కేటీఆర్ డిమాండ్ చేశారు. నీట్ ఎగ్జామ్ లో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఏకంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ రావటం అనుమానాలకు తావిస్తోంది. ఒకే ఎగ్జామ్ సెంటర్ నుంచి 8 మందికి ఏకంగా 720 మార్కులు రావడం గమనిస్తే.. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతోంది. ఒక్క మార్కు తేడాతో విద్యార్థుల ర్యాంకులు, జీవితాలు మారిపోతాయి. ఎంతోమంది అవకాశాలు కోల్పోతారు. కానీ ఒకే సెంటర్ లో ఇంతమంది విద్యార్థులకు రికార్డు మార్కులు రావడం ఎలా సాధ్యమని కేటీఆర్ ప్రశ్నించారు. రిజల్ట్స్ ను సైతం 10 రోజులు ముందుకు జరిపి సరిగ్గా ఎన్నికల ఫలితాల రోజే ప్రకటించటంపై అనుమానాలు ఉన్నాయి. నీట్ ఎగ్జామ్ వ్యవహారం బయటకు రాగానే విచారణకు ఆదేశించాల్సిన కేంద్రం ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. పైగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ ఏ సమస్య లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.లక్షలాది విద్యార్థులు ఎన్ని ఫిర్యాదులు చేసినా, పలువురు ప్రముఖులు సుప్రీంకోర్టులో కేసు వేసినా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునేంత వరకు కేంద్రం ఈ సమస్యను పట్టించుకోకపోవటంపై ఆశ్చర్యం కలిగిస్తోంది. సుప్రీంకోర్టు ప్రశ్నించిన తర్వాత కూడా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔెం) చిత్రమైన సమాధానాలు చెప్పింది. ఈ ఏడాది 1563 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలిపినట్లు చెబుతున్నారు. నీట్ లాంటి ఎగ్జామ్ లకు గ్రేస్ మార్కులు కలిపే విధానమే లేకున్నా, ఎందుకిలా చేశారో సమాధానం చెప్పాలి. 1563 మంది విద్యార్థులకే ఏ ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇచ్చారో చెప్పాలి. +4, -1 విధానం ఉండే ఈ ఎగ్జామ్ లో సాధ్యం కాని రీతిలో కొందరికి 718, 719 మార్కులు రావటం కూడా మొత్తం గ్రేస్ మార్కుల విధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేస్ మార్కులు పొందిన విద్యార్థులకు వాటిని తొలగించడం, చేయడం లేదు, మళ్లీ ఎగ్జామ్ రాయిస్తారా క్లారిటీ ఇవ్వడం లేదని మండిపడ్డారు.

## కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మచ్చ కవితకు చిరు సన్మానం

కోరుట్ల, జూన్ 17 (సూర్య వాస్తవం) : కోరుట్ల కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత మహిళల పట్ల శ్రద్ధ వహించి మహిళలకు ఏ సమస్య వచ్చిన ముందుండి వారి సమస్యల పరిష్కారాలకు కృషి చేస్తున్నందుకు పట్టణ కిస్మత్ బీడీ అధినేత కూతురు కాంగ్రెస్ నాయకురాలు చింత రూపాలత-అశోక్ తమ ఇంట్లో మర్యాదపూర్వకంగా మచ్చ కవితను కలిసి చిరు సన్మానం చేశారు..అనంతరం చింత రూపాలత మాట్లాడుతూ పట్టణంలో ఎంతోమంది మహిళలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, అలాంటి మహిళల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఆమె కోరారు. ముందు ముందు పట్టణంలో మహిళలకు ఎలాంటి ఆపద వచ్చినా తాను ఉన్నానని ముందుకు వచ్చి వారి ఆపదలో పాలుపంచుకోవాలని మచ్చ కవితను ఆమె కోరారు..

# సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా గంగోని బాలయ్య

జగిత్యాల, జూన్ 17 (సూర్య వాస్తవం) : జగిత్యాల జిల్లా సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా ఇబ్రహీంపట్నం మండలం బండలింగాపూర్ గ్రామానికి చెందిన గంగోని బాలయ్యను నియమిస్తూ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు అందే మారుతి బాపూజీ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అందే మారుతి బాపూజీ మాట్లాడుతూ ఈ నియామకం నేటి నుండి అమల్లోకి వస్తుందని తెలిపారు. అనంతరం గంగోని బాలయ్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సేవా రాష్ట్ర అధ్యక్షులు మిట్టెల జితేందర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో సేవాదళ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు అందే మారుతి బాపూజీ తో పాటు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్రీమెన్ కమిటీ అంగీకరించిన తరువాతే రుషికొండ భవనాల నిర్మాణం

విశాఖపట్నం జూన్ 17 (సూర్య వాస్తవం) : రుషికొండ నిర్మాణాలపై త్రీమెన్ కమిటీ వేశామని, కమిటీ అంగీకరించిన తరువాతే రుషికొండ భవనాలను నిర్మించారని వైఎస్ఆర్‌సిపి నేత గుడివాడ అమర్నాథ్ తెలిపారు. 2014 నుంచి 19 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంత ప్రజాధనం వృథా చేశారని అందరికీ తెలుసునని చురకలంటించారు. సోమవారం గుడివాడ అమర్నాథ్ మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఇల్లు నిర్మించుకునే సమయంలో బాబు ప్రైవేటు హోటల్ ఉండి రూ. కోట్లు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఎపి రాజధాని అమరావతిలో చంద్రబాబు తాత్కాలిక భవనాలు నిర్మించారని, కానీ వైసిపి అధినేత జగన్ రుషికొండపై శాశ్వత భవనాలు నిర్మించారని ప్రశంసించారు. టిడిపి నేతలకు ధైర్యముంటే వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూపాలని గుడివాడ అమర్నాథ్ డిమాండ్ చేశారు. లేనిపోనివి అంటగట్టి ప్రజలను మభ్యపెట్టొద్దని సూచిం చారు.

## దేశవ్యాప్తంగా గవర్నర్ల మార్పుకు రంగం సిద్ధం

న్యూఢిల్లీ జూన్ 17 (సూర్య వాస్తవం) : జాతీయ రాజకీయాల్లో వేగంగా మార్పులు జరుగుతున్నాయి. అన్ని రాష్ట్రాల గవర్నర్లను మార్చడానికి రంగం సిద్ధమయింది. కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం రాష్ట్రాల గవర్నర్ల మార్పులు చేర్పులు చేయబోతోంది.ప్రస్తుతం తెలంగాణకు ఉన్న ఇన్ ఛార్జీ గవర్నర్ సిపి. రాధాకృష్ణన్ పాండిచ్చేరి, జార్ఖండ్ గవర్నర్ గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు మాజీ కేంద్ర మంత్రి అశ్వినీ కుమార్ చౌబే గవర్నర్ కాబోతున్నట్లు సమాచారం. ఇదిలావుండగా తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోందని తెలుస్తోంది. మోడీకి అత్యంత నమ్మకస్తుడైన అశ్వినీ కుమార్ చౌబేను తెలంగాణ గవర్నర్ గా నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిసి వున్నప్పుడు (ఉమ్మడి ఏపి) ముఖ్యమంత్రిగా పనిచేసిన బిజెపి నాయకుడు కిరణ్ కుమార్ రెడ్డిని కర్నాటక రాష్ట్రానికి గవర్నర్ గా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పూర్వ విదార్థుల అపూర్వ సమ్మేళనం

కోరుట్ల,జూన్ 17 (సూర్య వాస్తవం) : పట్టణంలోని డిగ్రీ కళాశాలలో 2003-2006 డిగ్రీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఆటలాడుతూ పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు.ఈ సంధర్భంగా తమ బాల్యంలో జరిగిన ఆ పాతమధురాలను నెమరేసుకున్నారు. ఈ కార్యక్రమంలో 2003-2006 డిగ్రీ విద్యార్థులు,ఉపాధ్యాయులు ప్రస్తుత ప్రిన్సిపల్ నీలి వాసవి,వైస్ ప్రిన్సిపల్ బోర్ల నరేష్,అధ్యాపకులు చంద్రశేఖర్,క్యాతం వెంకన్న,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిముంపు బాధిత నిరుపేదలకు న్యాయం చేస్తా

నంద్యాల జూన్ 17 (సూర్య వాస్తవం) : శ్రీశైలం ప్రాజెక్టు క్రింద సర్వం కోల్పోయి ఆ గ్రామాల్లోనే జీవనం సాగిస్తున్న నిరుపేదలకు న్యాయం చేస్తానని నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల నిరుపేదలు, చెంచు గిరిజనులు నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్. శ్రీనివాసులును కలెక్టరేట్ లో కలిసి వినతి పత్రం అందించారు.నీటిముంపు భాదితుల సమస్యలు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరించగా పోలీస్, ఇరిగేషన్, రెవిన్యూ, పంచాయతీ రాజ్ తదితర అధికారులతో త్వరలో సమావేశం జరిపి పూర్తి వివరాలు సేకరించి నీటిముంపు గ్రామాల్లోనే గ్రామాలను నమ్ముకొని స్థిర నివాసం ఉంటున్న వారికే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# మంత్రుల ఛాంబర్లలోనూ చంద్రబాబు, పవన్ ఫోటోలు

విజయవాడ, జూన్ 17 (సూర్య వాస్తవం) :ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వ ఏర్పాటులో పవన్ కల్యాణ్ పాత్ర చాలా కీలకం. గత ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వను.. జగన్‌ను గెలవనివ్వను అని శపథం చేసిన పవన్.. అలుపెరగని పోరాటం చేశారు. ఊరూ, ఉడా వెళ్లి.. ఉద్వేగభరిత ప్రసంగాలతో జనాల ఓట్లు రాబట్టారు. ఫలితంగా ఎన్డీఏ కూటమి 164 సీట్లతో బంపర్ విక్టరీ నమోదు చేసింది. వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితం అయింది. ఇంతటి ఘనవిజయం వెనక పవన్ శ్రమ, పట్టుదల, పోరాటానికి విలువనిచ్చిన సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయనకు డిప్యూటీ సీఎం పోస్ట్‌తో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, రూరల్ వాటర్ సప్లై, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి కీలక శాఖలు కేటాయించారు. అలానే ప్రభుత్వ ఆఫీసుల్లో ఇకపై సీఎంతో పాటు డిప్యూటీ సీఎం ఫొటో కూడా ఉండాలని తాజాగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంత్రుల ఛాంబర్లలోనూ చంద్రబాబు, పవన్ ఫొటోలు పెడుతున్నారు. అలానే ప్రభుత్వ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి ఫోటోతో పాటుగా, ఉప ముఖ్యమంత్రి ఫోటో కూడా ఉండాలని చంద్రబాబు ఆదేశించారట. డిప్యూటీ సీఎం ప్రొటోకాల్ విషయంలోనూ మార్పులు చేసింది ఏపీ సర్కారు. ఆయనకు అదనపు భద్రతను కలిపించింది.మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చాంబర్ కేటాయించారు. సెక్రటేరియట్ రెండో బ్లాక్‌లోని మొదటి అంతస్తులో 212 రూమ్ కేటాయించారు. అక్కడ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. జనసేన మంత్రులు నాదెండ్ల, కందుల దుర్గేష్‌కు ఇదే అంతస్తులో చాంబర్లు కేటాయించేలా నిర్ణయం తీసుకున్నారు. పక్క పక్కనే పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ చాంబర్లు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు జూన్ 19న బాధ్యతలు స్వీకరించనున్నారు పవన్ కళ్యాణ్.ఎన్నికల్లో పోటీ చేసిన 21 స్థానాల్లో నెగ్గిన జనసేన.. చంద్రబాబు క్యాబినెట్‌లో 3 మంత్రి పదవులను సొంతం చేసుకుంది. పవన్ కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం పదవితో పాటు పలు ఇంపార్టెన్స్ ఉన్న శాఖలు ఇవ్వగా.. ఆ పార్టీ నేతలు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌లకు సైతం ప్రాధాన్య శాఖలు దక్కాయి. నాదెండ్ల మనోహర్‌కు పౌర సరఫరాల శాఖ, కందుల దుర్గేష్‌కు సినిమాటోగ్రఫీ, సాంస్కృతిక , పర్యాటకశాఖ మంత్రిగా నియమితులయ్యారు.



**పవన్ గెలుపు... మొక్కు తీర్చుకున్న గ్రామస్తులు**

అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం సమనసలో పవన్ కళ్యాణ్ కు విజయం వరించడంతో ఊరంతా కలిసి మొక్కులు తీర్చుకున్నరు గ్రామస్తులు. పవన్ కళ్యాణ్ భారీ విజయం సాధించడంతో గ్రామంలో ఉన్న పోలేరమ్మ అమ్మవారికి ఊరంతా కలసి 101 కోళ్లతో మొక్కులు తీర్చుకున్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా అమలాపురం వచ్చిన పవన్ కళ్యాణ్ విజయం సాధించాలని పోలేరమ్మకు పూజ చేసిన వెండి పూలతో విజయ దండ చేయించి పవన్ కళ్యాణ్ మెడలో వేశారు సమనస గ్రామ వైస్ ప్రెసిడెంట్ జనసేన వీర అభిమాని మామిడపల్లి దొరబాబు పవన్ కళ్యాణ్ మెడలో వేశారు. పిఠాపురం నుండి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ భారీ విజయం సాధించడం తోపాటు ఉప ముఖ్యమంత్రి గా బాధ్యతలు స్వీకరించడంతో అభిమాని దొరబాబు తోపాటు గ్రామస్తులు అంతా కలిసి గ్రామ దేవత పోలేరమ్మ కు ఊరందరు కలిసి కోళ్లు పట్టుకుని అమ్మవారి ఆలయం వద్ద మొక్కులు తీర్చుకున్నారు.పవన్ కళ్యాణ్ మరిన్ని విజయాలు సాధించాలని సమనస ఊరు ఊరంత కోలాహలంగా పండగలా చేసుకున్నారు. గ్రామదేవత పోలేరమ్మకు నైవేద్యం లతో అమ్మవారికి పూజలు చేసి కోళ్ళ ను ఊరిలో ఉన్న మరి కొందరికి పంచిపెట్టారు.పవన్ ప్రతి విజయం వెనుక పోలేరమ్మ ఆశీస్సులు ఉండాలని భవిష్యత్ లో మరిన్ని ఉన్నత శిఖరాలను పవన్ అధిరోహించాలని గ్రామస్తులు కోరారు.అయితే ఊరందరు ఒకేసారి కోళ్లు చేతపెట్టుకుని అమ్మవారి ఆలయం దగ్గరకు కలిసి రావడంతో అందరిని ఆకట్టుకుంది.

# తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ కు ముఖ్యమంత్రి అభినందనలు

**అమరావతి** జూన్ 17 (సూర్య వాస్తవం) : ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ యాదవ్‌కు ఆ పార్టీ జాతీయాధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కీలక సూచనలు చేశారు. పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధి మీరే. మీ కష్టాన్ని చూసి రాష్ట్ర అధ్యక్షుడిగా కీలక బాధ్యతలిచ్చాం. సీనియర్ల సూచనలు, జూనియర్ల మద్దతుతో పార్టీలో యువరక్తాన్ని చేర్చండి అని పల్లాకు సీఎం సూచించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఐదేళ్లు పడిన కష్టం, పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించి అతిపెద్ద బాధ్యత అప్పగించామని పల్లా శ్రీనివాస్‌తో సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన నేపథ్యంలో ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును పల్లా శ్రీనివాస్ యాదవ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. 'సామర్థ్యంపై నమ్మకంతో అతిపెద్ద బాధ్యత నీకు అప్పగించాం. సమర్థమంతంగా నిర్వహించాలి. అధికారంలో ఉన్నపుడు ప్రతి కార్యకర్తను దగ్గరకు చేర్చుకోవాలి. ప్రతి ఒక్కరికి తగు గౌరవం కల్పించాలి. ప్రత్యేకంగా యువతను పార్టీలోకి ఆహ్వానించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుంచి యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలి. యువతతోనే సమాజంలో మార్పులు సాధ్యమవుతాయి. జాతీయ అధ్యక్షుడిగా పార్టీ పరంగా, సీఎంగా ప్రభుత్వ పరంగా అండగా ఉంటాను. నిత్యం



కార్యకర్తలతో అనుసంధానమై పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి. పార్టీ పరంగా అన్ని రకాలుగా సంపూర్ణ మద్దతు ఇస్తాను. సీనియర్ల సూచనలు, జూనియర్లు, యువత మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేయాలి. వచ్చే నెల నుంచి పార్టీ మెంబర్‌షిప్ డ్రైవ్‌ను కూడా పున:ప్రారంభించాలి' అని చంద్రబాబు సూచించారు.

# రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాసరావుతో ముఖ్యమంత్రి

**అమరావతి** జూన్ 17 (సూర్య వాస్తవం) : ప్రతిపక్షంలో ఉన్నపుడు ఐదేళ్లుగా పడిన కష్టం, పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని గుర్తించి అతిపెద్ద బాధ్యత అప్పగించామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులైన పల్లా శ్రీనివాస్‌ను చంద్రబాబు నాయుడు ప్రసంగించారు . రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన నేపథ్యంలో ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబును రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్ కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. నారా చంద్రబాబు మాట్లాడుతూ.. నమ్మకంతో అతిపెద్ద బాధ్యత నీకు అప్పగించాం. సమర్ధంగా నిర్వహించాలి. అధికారంలో ఉన్నపుడు ప్రతి కార్యకర్తను దగ్గర చేర్చుకోవాలి. ప్రతి ఒక్కరికీ తగు గౌరవం కల్పించాలి. ప్రత్యేకంగా యువతను పార్టీలోకి ఆహ్వానించాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుండి యువతను రాజకీయాల్లోకి స్వాగతించాలి. యువతతోనే సమాజంలో మార్పులు సాధ్యమవుతాయి. జాతీయ అధ్యక్షునిగా పార్టీ పరంగా, ముఖ్యమంత్రిగా ప్రభుత్వ పరంగా అండగా ఉంటాను. నిత్యం కార్యకర్తలతో అనుసంధానమై పార్టీకి ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలి. పార్టీ పరంగా అన్ని రకాలుగా సంపూర్ణ మద్దతు ఇస్తాను. సీనియర్ల సూచనలు, జూనియర్లు,





యువత మద్దతుతో పార్టీని మరింత బలోపేతం చేయాలి. వచ్చే నెల నుండి పార్టీ మెంబర్ షిప్ డ్రైవ్ కూడా పున:ప్రారంభించాలి. వీలైనంత త్వరగా నామినేటెడ్ పదవుల్లో పని చేసిన కార్యకర్తల్ని నియమించి గౌరవించాలి. అదే సమయంలో పార్టీ కోసం పని చేసిన ప్రతి నాయకుడికీ తగిన గుర్తింపు ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూచించారు.అనంతరం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షునిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నాకంటే పెద్ద బాధ్యత మీపై ఉంచారని నారా లోకేశ్ పేర్కొన్నారు. ప్రతి క్షణం కార్యకర్త నుండి నాయకుల వరకు అందరికీ తోడుగా నిలవాలి. కొన్ని ప్రాంతాల్లో కార్యకర్తలు, నాయకులు స్తబ్దుగా ఉన్నారని, వారందరి నీ యాక్టి వేట్ చేయాల్సిన గురుతర బాధ్యత మీపై ఉందని అన్నారు. పార్టీ కార్యాలయంలో మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయబోతున్నామని, తద్వారా ప్రతి మంత్రి కూడా నెలలో ఒక రోజు కనీసం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండబోతున్నారని తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి సముచిత న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ అధినాయకత్వం నుండి సంపూర్ణ మద్దతు ఉంటుందని, ఏం కావాలన్నా అందించేందుకు పార్టీ సిద్ధంగా ఉందని నారా లోకేశ్ తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడం కోసం అనునిత్యం కష్టబడతా నని, సీనియర్ల సలహాలతో పార్టీకి యువరక్తం ఎక్కించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పల్లా శ్రీనివాస్ అన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేలా చొరవ తీసుకుంటానన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయబోనన్నారు. కష్టబడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని పల్లా శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

Truth of News
సూర్య
http://www.suryavastavam.com
వాస్తవం

# అమరావతి
## గుంటూరు, ఉమ్మడి కృష్ణా

## స్పీకర పదవి కోసం కసరత్తు
### ప్రచారంలో అయ్యన్న పాత్రుడి పేరు

అమరావతి,జూన్ 17 (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరినందున ఇక స్పీకర్ ఎవరన్న చర్చ సాగుతోంది. సమర్థుడైన వారే స్పీకర్‌గా ఉంటే మంచింది. ఈక్రమంలో సమర్థులకు పదవులు ఇచ్చేందుకు బాబు కసరత్తు చేస్తున్నట్లుగా సమాచారం. మాజీమంత్రి , సీనియర్ నేత అయ్యన్న పాత్రుడుకు స్పీకర్ పదవి ఇచ్చే అవకావం ఉందని ప్రచారం సాగుతోంది. మంత్రి పదవి రాకపోవడంతో ఆయన కొంత అసంతృప్తిలో ఉన్నారు. దీంతో ఆయనకు స్పీకర్ పదవి వస్తుందని అంటున్నారు. ఈ క్రమంలో జనసేనకు మరో కీలక పదవి వరించే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. ఇప్పటికే మంత్రివర్గంలో జనసేనకు సముచిత స్థానం కల్పించారు. మూడు మంత్రిపదవులు ఇచ్చారు. పవన్ కల్యాణ్‌కి ఉప ముఖ్యమంత్రి చేశారు. ఈ క్రమంలోనే మరో కీలకమైన బాధ్యతను జనసేన నేతలకు అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. జనసేన 21 ఎమ్మెల్యే స్థానాల్లో విజయం సాధించింది. దీంతో వాళ్లకు మూడు మంత్రిపదవులు దక్కాయి. దీంతోపాటు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా వరించింది. ఇప్పుడు డిప్యూటీ స్పీకర్ పదవిని కట్టబెట్టాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు. ఈ రేసులో తాడేపల్లి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ద ప్రసాద్ ఉన్నట్టు తెలుస్తోంది. చివరి నిమిషంలో లోకం మాదవి పేరు కూడా పరిశీలనలోకి వచ్చింది. ఇప్పటి వరకు స్పీకర్ ఎవరనేది తేలలేదు. చాలామంది పేర్లు వినిపిస్తున్నప్పటికీ అయ్యన్న పాత్రుడు పేరు దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. తన సన్నిహితుల వద్ద కూడా ఈ విషయాన్ని అయ్యన్న ప్రస్తావించినట్టు చెప్పుకుంటున్నారు. స్పీకర్ పదవి అయ్యన్నకు దాదాపు ఖరారు అయిపోయిందని అంటున్నారు. ఇప్పుడు డిప్యూటీ కూడా బుద్దప్రసాద్, బొలిశెట్టి, లోకం మాధవిలో ఒకరి ఖరారు కానుంది. బుధవారం నుంచి తొలి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. మొదట ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ నాయకుడు ఉంటారు. ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక జరుగుతుంది. మరోవైపు చీఫ్‌విప్ పదవి టీడీపీ సీనియర్ నేత దూళ్లిపాళ్ల నరేంద్రకు ఇవ్వనున్నారని సమాచారం.

## భగవద్ రామానుజ గోష్ఠి ఆధర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



జగ్గయ్యపేట,సూర్య వాస్తవం: భగవద్ రామానుజ గోష్ఠి ఆధర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని దుప్పట్ల పేదలకు అందించారు. సోమవారం పట్టణంలోని పురాతన దేవాలయమైన శ్రీ భూగోదా సమేత చెన్నకేశవ స్వామి వారి ఆలయ ఆవరణలో ఏకాదశి పర్వదిన సందర్భంగా గర్భాలయంలోని స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు అనంతరం స్వామి అమ్మ వాళ్లకు నూతన వస్త్రాలతో తీర్చిదిద్ది వివిధ పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ విశేష అభిషేకాలు పూజాది కార్యక్రమాలలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, శ్రీరాం సిద్దు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవద్ రామానుజ గోష్ఠి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో జరిగిన పేదలకు దుప్పట్లు పంపిణీ లో తాతయ్య, పాల్గొని వృద్ధులకు పేదలకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సిద్దు, భగవత్ రామానుజ గోష్ఠి ప్రతినిధులు ఆకల స్వాతి కుమార్ విజయ దంపతులు, వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు, చెన్నకేశవ స్వామి వారి భక్త బృందం, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఆర్థికశాఖ కార్యదర్శికి ఝలక్
### విధుల్లోంచి రిలీవ్ కాకుండా సిఎస్ ఆదేశాలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారా యణకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. బాధ్యతల నుంచి రిలీవ్ కావొద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆయనకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడంతో మూడ్రోజుల కిందట సత్యనారాయణ నేరుగా వెళ్లి నార్త్ ఈస్టర్న్ రైల్వేలో జాయిన్ అయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు సైతం ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలంటే సత్యనారాయణకు రిలీవింగ్ ఆర్డర్ కావాలి. ఈలోపే విషయం తెలుసుకున్న సీఎస్ నీరబ్ కుమార్ రిలీవ్ కావొద్దంటూ ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అందులోనూ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్ సిక్ లీవ్‌లో ఉండటంతో ఈనెల 18న రిలీవ్ కావాల్సిన అవసరం లేదంటూ సీఎస్ స్పష్టం చేశారు. దీంతో సత్యనారాయణ ఎస్కేప్ ప్రయత్నాలకు చెక్ పడినట్లయ్యింది. 2017లో రైల్వే నుంచి వచ్చి ఏపీ ఆర్థిక శాఖలో సెక్రెటరీగా ఐఆర్ఎస్ అధికారి సత్యనారాయణ జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి ఆ శాఖలో ఆయన అరాచకం సృష్టించారు. అనేక అవకతవకల కు ఆయనే కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో కేవలం వైసీపీ నేతల అనుచరులుగా ఉన్న కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించి మిగతా వారిని పక్కన పెట్టారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. బిల్లుల కోసం హైకోర్ట్‌లో వేల సంఖ్యలో కేసులు, కోర్టు ధిక్కార కేసులు నమోదయ్యాయి. భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టుపెట్టి అప్పు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఫోన్ వస్తే చాలు ఎవరికి బిల్లులు చెల్లించమంటే వారికి చెల్లించారు.

# ముస్లిం సోదరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ నేత జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల,జూన్ 17 (సూర్య వాస్తవం) : త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం పవిత్ర బక్రీద్ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.. ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలోని ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సోదరులను కలిసి అందాయి బలాయి చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేశారు.. మత ప్రవర్త ఇబ్రహీం తన కుమారుడ్ని దైవ మార్గంలో బలి ఇచ్చేందుకు ఉపక్రమించే త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగను జరుపుకుంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, పట్టణ కౌన్సిలర్లు సంఘ లింగం, ఎంబేరి నాగభూషణం, నాయకులు ఆడెపు మధు,ఎంబేరి సత్యనారాయణ, ఖయ్యుమ్, రిజ్వాన్, రియాజ్,ఏఆర్ అక్బర్, సైపుద్దీన్, పసుల కృష్ణ, ప్రసాద్, బన్న రాజేష్, మేదరి లక్ష్మణ్ ,జాగిలం భాస్కర్ ,ముక్కెర రాజేష్, సదుల వెంకటస్వామి, ఎడ్ల రమేష్, చిట్యాల లక్ష్మీనారాయణ ,చిట్యాల అశోక్, రసూల్, తదితరులు ఉన్నారు.

# జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రూ 20 వేల ఆర్థిక సహాయం

జగిత్యాల, జూన్ 17 (సూర్య వాస్తవం) : జిల్లా కేంద్రంలోని గొల్లపెల్లి మండలం మల్లన్నపేట గ్రామానికి చెందిన మున్నూరు కాపు కులానికి చెందిన నిరుపేద కుటుంబం చెందిన లక్కకుల మల్లేష్ ఉపాధి కోసం మహారాష్ట్రలోని ముంబై లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు.ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో భార్య జమున, ఇద్దరు చిన్న పిల్లలతో దయనీయ స్థితిలో జీవనం సాగిస్తుంది..కుల సంఘం నాయకులు భీమా సంతోష్ ,ఆనంతుల మహేష్, ద్వారా మున్నూరు కాపు జిల్లా సంఘానికి తెలుపగా సంఘ సభ్యులు స్పందించిన బాధిత కుటుంబానికి రూపాయలు 20 వేల రూపాయలు అందజేశారు...ఈ సందర్భంగా జగిత్యాల మున్నూరుకాపు జిల్లా అధ్యక్షులు వొద్నాల రాజశేఖర్ మాట్లాడుతూ పిల్లల భవిషత్తు రీత్యా వారి విద్యా అబ్యాసం, కుటుంబానికి అన్ని విధాలుగా సంఘం తరుపున సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాచకొండ శ్రీరాములు,బండారి విజయ్, లైశెట్టి వెంకన్న,చిట్ల అంజన్న, కొలగాని మధుసుదన్,జున్ను రాజేందర్, అయ్యోరి సుధాకర్, అత్తినేని శ్రీనివాస్, చీటీ లక్ష్మీనారాయణ,మున్నూరు కాపు గ్రామ అధ్యక్షుడు అవారి లచ్చన్న, సిద్దెంకి మల్లారెడ్డి, రమేష్,కల్లేం బాల్ రెడ్డి, అవారి శ్రీనివాస్, అనంతుల మహేష్, పడాల తిరుపతి,గంగారెడ్డి, మల్లారెడ్డి, బీమ రాము,శేంకర్ ముత్యాల మోహన్ రెడ్డి, మల్లారెడ్డి,లక్కకుల రాజమల్లు, రవి,మహేష్, పాల్గొన్నారు.

# నాలుగు కుటుంబాలలో ప్రేమ చిచ్చు

హైదరాబాద్, జూన్ 17 (సూర్య వాస్తవం) : ప్రేమ వ్యవహారం నాలుగు కుటుంబాల్లో విషాదం నింపింది. రెండు వేర్వేరు ప్రాంతాల్లో ప్రేమ పేరుతో జరిగిన దుర్ఘటలు కుటుంబాలను కంటతడి పెట్టిస్తున్నాయి. ఓ ఘటనలో ప్రేమ వ్యవహారం నచ్చలేదని ఓ ఫ్యామిలీపై దాడి చేసిందో కుటుంబం. మరో ఘటనలో పెద్దల విడదీస్తారన్న భయంతో ఆత్మహత్యకు యత్నించిందో జంట. రెండు ఘటనల్లో కూడా పోలీసులు జోక్యం చేసుకొని కేసు నమోదు చేశారు. వరంగల్‌లోని కీర్తినగర్ కాలనీకి చెందిన అద్నాన్ అలీ అదే కాలనీ చెందిన యువతితో కొన్ని సంవత్సరాలుగా ప్రేమ వ్యవహారాన్ని కొనసాగిస్తున్నారు అయితే యువతి తల్లిదండ్రులకు ప్రేమ వ్యవహారం ఇష్టం లేదు. ఇరు కుటుంబాల మధ్య ఎప్పటి నుంచో పంచాయితీ నడుస్తోంది. చివరకు ఈ మధ్య ఎంబీఏ పూర్తి చేసిన అద్నాన్ అలీ పని నిమిత్తం బయటకు వెళ్లి ఇంటికి వచ్చారు. అప్పటికే కీర్తి నగర్ కాలనీకి చేరుకున్న యువతి తండ్రి తన బంధువులు అద్నాన్ అలీ ఇంటిపై దాడి చేశారు. మారణాయుధాలతో అతన్ని, అతని తల్లిపై దాడికి పాల్పడ్డారు. ఇద్దరినీ తీవ్రంగా గాయపరిచారు. తీవ్ర గాయాలైన అద్నాన్ అలీ, సమీరాను స్థానికులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన ప్రవలికకు మూడేళ్ల క్రితం వివాహమైంది. వివాహం జరిగిన కొద్ది రోజులకే భార్యాభర్తలు విడిపోయారు. ఇంటివద్ద ఉంటున్న ప్రవళిక అదే గ్రామానికి చెందిన రవీందర్‌తో మరోసారి ప్రేమలో పడింది. వీరి ప్రేమ వ్యవహారం ఇరు కుటుంబాల్లో తెలియడంతో పెళ్లికి అడ్డు చెప్పారు. కుటుంబాలు అంగీకరించకపోవడంతో... రెండు నెలల క్రితం ప్రవళిక రవీందర్ పారిపోయి శ్రీకాకుళం జిల్లాలో జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కనిపించడం లేదని ప్రవలిక, రవీందర్ తల్లిదండ్రులు బయ్యారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టిన పోలీసులు వారం రోజుల క్రితం శ్రీకాకుళం వెళ్లి ఇద్దరిని పట్టుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వీరి ప్రేమ వ్యవహారంపై గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ జరగనుంది. పంచాయితీలో తీర్పు అనుకూలంగా వస్తుందో రాదోనని ఆందోళనకు గురైన ప్రవళిక, రవీందర్ ఒకే చోట ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ప్రవళిక మృతి చెందగా, రవీందర్ ప్రాణాపాయ స్థితిలో బయటపడ్డాడు. ఆ ప్రయత్నం విఫలమవ్వడం ప్రవళిక చనిపోవడంతో రవీందర్ మళ్ళీ కత్తితో గొంతు కోసుకున్నాడు. రవీందర్ పరిస్థితి విషమంగా ఉంది. అతన్ని కూడా వరంగల్ ఎం.జి.ఎం ఆసుపత్రికి తరలించారు. ప్రవళిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

# సూపర్ క్వీన్ యాక్టింగ్ తో అంతా ...

అదిలాబాద్, జూన్ 17 (సూర్య వాస్తవం) : భర్త దారుణ హత్య కేసులో ఏ 1 నిందితురాలుగా జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఓ నిందుతురాలు జైలు నుండి బయటపడేందుకు సూపర్ క్వీన్ యాక్టింగ్ ప్రదర్శించింది. ఆత్మహత్య చేసుకున్నాని.. ప్రాణాలు పోతున్నాయంటూ గొంతు పట్టుకుని కేకలు వేసింది. నిజమేనని నమ్మిన జిల్లా జైలు సిబ్బంది నిందితురాలి ప్రాణాలు కాపాడేందుకు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిందితురాలు ఆరోగ్యంగానే ఉందని ఎలాంటి ప్రమాదం లేదని తేల్చడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆత్మహత్య యత్నం అంతా ఉత్తిదే అని గుర్తించిన జైలు సిబ్బంది నిందితురాలిని తిరిగి జైలుకు తరలించారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా జైల్‌లో చోటు చేసుకుంది.12న ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం అర్జుని, లోకారి శివారు అటవీ ప్రాంతంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్ దారుణ హత్యకు గురయ్యాడు. 24 గంటల్లోనే కేసును చేదించిన పోలీసులు.. గజేందర్ హత్యకు కర్త, కర్మ, క్రియ భార్య విజయలక్ష్మి అని తేల్చారు. ప్రియుడి మాయలో పడి.. ఆరు లక్షల సుపారీ ఇచ్చి మరి భర్తను దారుణంగా హత్య చేయించిందని గుర్తించి అరెస్ట్ చేశారు పోలీసులు. ఈనెల 15న అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించారు. ఆదిలాబాద్ జిల్లా జైలులో రెండు రోజులు రిమాండ్ ఖైదీగా గడిపిన విజయలక్ష్మి సూపర్ యాక్టింగ్‌తో జిల్లా జైలు సిబ్బందిని బోల్తా కొట్టించే ప్రయత్నం చేసింది. జైలులో హైడ్రామా క్రియేట్ చేసి కడుపులో విఫరీతమైన నొప్పి ఉందని.. అరెస్ట్ సమయంలో ఉట్నూర్ డీఎస్పీ కార్యాలయంలో బ్లేడ్ ముక్కలు మింగానని ఆదిలాబాద్ జిల్లా సూపరింటెండెంట్‌కు గోడు వెళ్లబోసుకుంది. రిమాండ్ ఖైదీ కావడం అందులోను మహిళ కావడంతో నిజమే అని నమ్మిన జైలు సిబ్బంది.. తనను కాపాడేందుకు హుటాహుటిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎండోస్కోపీ నిర్వహించి ఎలాంటి ప్రమాదకర పదార్థం మింగలేదని.. బ్లేడ్ ముక్కలు లాంటివి ఏం లేవని తేల్చారు. రెండు గంటలు అబ్జర్వేషన్?లో పెట్టిన వైద్యులు నిందితురాలి ఆరోగ్యం బాగానే ఉందని తేల్చారు. దీంతో ఊపిరి పీల్చుకున్న జిల్లా జైలు సిబ్బంది తిరిగి భద్రత నడుమ నిందితురాలు విజయలక్ష్మిని జిల్లా జైలుకు తరలించారు. విజయలక్ష్మి సూపర్ క్వీన్ యాక్టింగ్?ను చూసిన జిల్లా జైలు సిబ్బంది ముక్కు మీద వేలాసుకున్నారు. భర్తను అత్యంత కిరాతకంగా హత్య చేయించిన నిందితురాలిని కూడా నమ్మాల్సిన పరిస్థితి ఏర్పాడిందంటూ వాపోయారు.

# టీ తాగడానికి వచ్చి 96 వేలు ...

మహబూబ్ నగర్, జూన్ 17 (సూర్య వాస్తవం) :టెక్నాలజీ పెరగడం వల్ల ఎన్ని లాభాలు ఉన్నాయో.. అంతే స్థాయిలో నష్టాలు కూడా ఉన్నాయి. టెక్నాలజీని ఉపయోగించి కేటుగాళ్లు ఎన్నో మోసాలకు తెగబడుతున్నారు. తాజాగా హోటల్‌లో టీ తాగేందుకు వచ్చిన వ్యక్తి.. ఏకంగా ఆ హోటల్ నిర్వాహకుడి ఫోన్ నుంచే 96వేల రూపాయలు కొట్టేశాడు. సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.విషయం తెలుసుకున్న ఆ హోటల్ యజమానితోపాటు, గ్రామస్తులు షాక్ అయ్యారు. వివరాల్లోకి వెళ్తే?అక్కన్నపేట మండల కేంద్రంలోని హోటల్‌లో టీ తాగేందుకు వచ్చిన ఓ వ్యక్తి, డబ్బులు చెల్లించే నెపంతో అతని నుంచే తస్కరించాడు. ఏకంగా ఆ హోటల్ నిర్వాహకుడి ఫోన్ నుండి గూగుల్ పే ద్వారా రూ.96వేలు చోరీ చేశాడు. రాజస్థాన్‌కు చెందిన నారాయణ అనే వ్యక్తి గత ఐదేళ్లుగా అక్కన్నపేట మండల కేంద్రంలో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఆయన హోటల్‌కు చత్తీస్ ఘడ్‌కు చెందిన ఓ వ్యక్తి టీ తాగేందుకు వచ్చాడు. టీ తాగిన తర్వాత తన వద్ద డబ్బులు లేవని తన మిత్రుడు గూగుల్ పే ద్వారా డబ్బు పంపిస్తాడని చెప్పి ఫోన్ చేసి నంబర్ చెప్పాలని హోటల్ నిర్వాహకుడు నారాయణను కోరాడు.దీంతో ఆ హోటల్ నిర్వాహకుడు ఆ వ్యక్తి చెప్పిన నంబర్‌కు ఫోన్ చేయడంతో 500 రూపాయలు అవతలి వ్యక్తి గూగుల్ పే చేశాడు. అనంతరం సదరు వ్యక్తి హోటల్ నిర్వాహకుడిని ఒకసారి ఫోన్ ఇవ్వాలని, తన స్నేహితుడికి ఫోన్ చేసి మాట్లాడుతానని తీసుకుని నారాయణ గూగుల్ పే నుండి రూ.96వేలు తన స్నేహితుడి ఫోన్ నంబర్‌కు పంపించాడు. పనిలో పడిన హోటల్ నిర్వాహకుడు నారాయణ ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ఆ తర్వాత చూసే సరికి తన అకౌంట్‌లో డబ్బులు ఖాళీ అవ్వడంతో షాక్ అయ్యాడు. తాను మోసపోయినట్లు గుర్తించి వెంటనే అక్కన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు హోటల్ నిర్వాహకుడు నారాయణ. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# చంద్రబాబును చూసి నేర్చుకోండి



హైదరాబాద్, జూన్ 17 (సూర్య వాస్తవం) : పింఛన్ల పెంపు విషయంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని చూసైనా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేర్చుకోవాలంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు ముందు చెప్పినట్టే చంద్రబాబు నాయుడు రూ.4 వేలకు పింఛన్లు పెంచారని.. ఆ మేరకు మొదటి సంతకం పెట్టారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి చెప్పిన మొదటి సంతకం ఏమైందని ప్రశ్నించారు. ఏపీని చూసైనా నేర్చుకోవాలని.. రూ.4 వేల పింఛన్లు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగుల పక్షాన, గ్రూప్స్ అభ్యర్థుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఆరు నెలల్లో చెప్పిన మాట ప్రకారం కాంగ్రెస్ సర్కారు రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు,కాగా తాను పార్టీ మారుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని హరీష్ రావు స్పష్టంచేశారు. తాను కాంగ్రెస్, బిజెపిలో చేరుతున్నానంటూ ఇష్టానుసారంగా సోషల్ మీడియాలో వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. కొన్ని యూట్యూబ్ ఛానల్స్ థంబ్స్ పెట్టి కావాలనే అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇకపై ఇలాగే తప్పుడు వార్తలు రాస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వ్యూస్ కోసం తప్పుడు రాతలా వ్యూస్ కోససం ఓ నాయకుడి నిబద్ధతను, నిజాయతీని దెబ్బతీయొద్దని మీడియాకు హితవుపలికారు. అలాంటివి మానుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని ఘాటుగా చెప్పారు.సంచలనాల కోసం తనపై మీడియా, సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానల్‌లో చేస్తున్న ప్రచారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు మాజీ మంత్రి హరీష్‌రావు. “వర్కింగ్ ప్రెసిడెంట్‌ను అయ్యానని, కాంగ్రెస్‌లోకి, బీజేపీలోకి వెళ్తున్నానని ఏవేవో చెబుతున్నారు. దయచేసి ఇలాంటి పెట్టకండి. లైక్స్, వ్యూస్ కోసం నాయకుడి నిబద్ధత, నిజాయితీని దెబ్బతీయకండి. ఇలాంటివి మానుకోకపోతే లీగల్ చర్యలు తీసుకోడానికి వెనుకాడబోం.” అని అన్నారు. అంతకంటే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై మండిపడ్డారు. “గ్రూప్ 1, గ్రూప్ 2 అభ్యర్థులు, నిరుద్యోగులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు. పబ్లిక్ సర్వీస్‌కమిషన్ ఛైర్మన్ దగ్గరికి వెళ్తే ప్రభుత్వం చేతుల్లోనే అంతా ఉందంటున్నారు. ప్రజా దర్బార్‌కు వెళ్లి కాళ్లమీద పడ్డా కనికరించడం లేదు. నిరుద్యోగులకు మాట ఇచ్చిన కోదండరామ్ దగ్గరికి వెళ్లినా స్పందన లేదు. కొత్త హామీలను కాకుండా మీరు ఇచ్చిన హామీలన అమలు చేయమని కోరుకుంటున్నారు.” “కాంగ్రెస్ నిరుద్యోగులకు లేనిపోని హామీలిచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడెందుకు మాట తప్పుతోంది? నిరుద్యోగుల తరపున 5 డిమాండ్లు ప్రభుత్వం ముందు పెడుతున్నాం. గ్రూప్ 1కు 1:100 చొప్పున మెయిన్స్‌కు అవకాశం ఇవ్వాలి. గ్రూప్ 2కు 2వేలు, గ్రూప్ 3కి 3 వేల ఉద్యోగాలు కలుపుతామన్న మాట నిలబెట్టుకోవాలి. పరీక్షల మధ్య 2 నెలల గ్యాప్ ఉండాలి. జులైలో డీఎస్సీ నిర్వహిస్తున్నారు. నీట్‌లో గ్రేస్ మార్కుల విధానమే లేనప్పుడు ఎలా కలిపారు? ఫలితాలను పది రోజులు ముందుకు జరిపి, పార్లమెంటు ఫలితాల రోజే ఎందుకు విడుదల చేశారు? ఎన్నో అనుమానాలున్నాయి. దీనిపై ప్రభుత్వం సీబీఐ, ఈడీ విచారణ ఎందుకు జరపడం లేదు? పేపర్ లీక్ కాకపోతే బిహార్, గుజరాత్‌లో ఎందుకు అరెస్టులు జరుగుతున్నాయి? తెలుగు విద్యార్థులకు అన్యాయం జరక్కుండా బీజేపీ ఎంపీలు, మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి స్పందించాలి. ఇంత ప్రధాన సమస్యపై మీరెందుకు మాట్లాడ్డం లేదు?


# చంద్రబాబు గెలుపుతో... 5 ఏళ్ల తర్వాత పుట్టింటికి మహిళ

ఖమ్మం, జూన్ 17 (సూర్య వాస్తవం) : ఖమ్మం జిల్లాలో విచిత్ర సంఘటన జరిగింది. ఎన్నికల సమయంలో బెట్టింగ్ కాసి లక్షల్లో గెలుకునే వారు ఉంటారు, కోట్ల రూపాయాలు, ఆస్తులు, సర్వస్వం కోల్పోయే వారిని సైతం మనం చూస్తుంటాం. ఓ వివాహిత ఏపీ ఎన్నికలపై కాసిన పందెం తన పుట్టింటికి ఐదేళ్లపాటు వెళ్లడానికి దారి తీసింది. తాజాగా ఐదేళ్ల తరువాత మరుసటి ఎన్నికల్లో తన ఛాలెంజ్ నెగ్గడంతో పుట్టింటికి వచ్చిన ఆమెకు స్థానికులతో పాటు కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు.ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి (పుట్టినిల్లు) చెందిన మహిళ కట్టా విజయలక్ష్మి. 2019 ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అవుతారని విజయలక్ష్మి భావించారు. కుటుంబసభ్యలతో చెప్పగా వారు ఆమె మాట నమ్మలేదు. దాంతో చంద్రబాబు సీఎం అవుతారని విజయలక్ష్మి ఛాలెంజ్ చేశారు. కచ్చితంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని కుటుంబసభ్యులు సైతం పెందెం కాశారు. ఒకవేళ తాను ఓడితే పుట్టింటికి రానని, చంద్రబాబు గెలిచాకే అడుగుపెడతానని విజయలక్ష్మి ఛాలెంజ్ చేశారు. 2019 ఎన్నికల్లో నెగ్గి జగన్ సీఎం కావడంతో పందెం ఓడిన విజయలక్ష్మి గత ఐదేళ్ల నుంచి పుట్టింటికి వెళ్లడం లేదు.2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. జూన్ 12న ఏపీ సీఎంగా ప్రమాణం సైతం చేశారు. ఈ ఎన్నికల్లో ఛాలెంజ్‌లో తాను నెగ్గడంతో ఐదేళ్ల తరువాత సొంత గ్రామం కేశవాపురం వచ్చారు విజయలక్ష్మి. శపథం నెరవేరడంతో ఐదేళ్ల తరువాత పుట్టింటికి వచ్చిన ఆమెకు గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఘనస్వాగతం పలికారు. శపథం నెరవేరడంతో ఆమెను సత్కరించారు. గ్రామంలోకి అడుగుపెట్టిన విజయలక్ష్మి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం తన పుట్టింటికి వెళ్లారు. ప్రస్తుతం ఈ విషయం ఖమ్మం జిల్లాలో హాట్ టాపిక్ అవుతోంది. విషయం తెలిసిన కొందరు ఇదెక్కడి అభిమానం రా నాయనా అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# గణేష్ యాదవ్ కు ప్రసంశలు

హైదరాబాద్,, జూన్ 17 (సూర్య వాస్తవం) : బక్రీద్ పండుగ సందర్భంగా గత కొన్ని రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో వివాదాస్పద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. బక్రీద్ సందర్భంగా గోవధ జరగకుండా చూడాలని ఒక వర్గం అరాటపడుతుంటే, గోవధ జరుపుతామని మరో వర్గం చర్యలకు పాల్పడుతుంది. ఈ ఇతరుణంలో పోలీసులు అనేక ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటికే గోవుల తరలింపుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు సైతం పోలీసు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడా గోవుల తరలింపు జరగకుండా అడ్డుకోవాల్సిందిగా పోలీసులకు చెప్పింది. బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ వేసిన పిటీషన్‌పై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.పోలీసులు ఎన్ని చెక్ పోస్టులు పెట్టినా.. కొన్నిచోట్ల గోవులను అక్రమంగా తరలించి గోవధ జరిపేందుకు ఒక వర్గం ప్రయత్నిస్తుండటంతో మరో వర్గానికి సంబంధించిన యువకులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిణామాలు జరిగిన ప్రతి చోట ఘర్షణలు తలెత్తాయి. మెదక్ లాంటి ప్రాంతాల్లో ఇప్పటికీ ఇంకా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. హైదరాబాదులో కూడా చాలా ప్రాంతాల్లో గోవుల తరలింపును ఒక వర్గం యువకులు అడ్డుకొని ఆందోళన చేశారు. గోవులను తరలిస్తున్న వ్యక్తులపై పోలీసులు కేసులు పెట్టడం లేదంటూ విశ్వహిందూపరిషత్?తో పాటు బజరంగ్?దళ్ నేతలు సైతం ఆరోపిస్తున్నారు.నగరానికి సంబంధించి ఇలాంటి గొడవలు చోటు చేసుకోకుండా గో భక్త ఉత్సవ సేవా సమితి అధ్యక్షుడు గణేష్ యాదవ్ ఓ కొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇరువర్గాలు గొడవ పడకుండా చూసే ప్రయత్నంలో భాగంగా ఆయన పాతబస్తీలోని సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించారు. గో వధ కోసం జరుగుతున్న అమ్మకాలను గమనించి తానే గోవులను కొనే ప్రయత్నం చేశారు. పాతబస్తీలో ఉన్న గోవులను రక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయిన తెలిపారు. పాతబస్తిలో ఉన్న 15 ఎద్దులు, రెండు ఆవులను గణేష్ యాదవ్ కొనుగోలు చేశారు. ఒక్కొక్క ఆవును రూ.35 వేలకు కొనుగోలు చేశారు.గణేష్ యాదవ్ చేసిన పనిని హిందూ సంఘం నేతలు అభినందిస్తున్నారు. బక్రీద్ రోజు గోవుల విక్రయాలు జరగకుండా.. గోవులను విక్రయిస్తున్న వారి నుండే వాటిని కొనుక్కొని తమ ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేయాలని అయిన పిలుపునిచ్చారు. ఇలా చేస్తే గోవధ జరగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంది అని ఆయన తెలిపారు. ఇప్పటివరకు గోవుల తరలింపుకు సంబంధించి పోలీసులు 100కు పైగా కేసులు నమోదు చేశారు.

# అడ్డంగా దొరికిన డీజే సిద్ధార్థ్



హైదరాబాద్, జూన్ 17 (సూర్య వాస్తవం) : డ్రగ్స్ కేసులో డీజే సిద్ధార్థ్ అడ్డంగా దొరికిపోయాడు. కొంతకాలం నుంచి సిద్దార్థ్ పెద్ద మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకుంటున్నట్లు నార్కోటిక్ బ్యూరో పోలీసులు గుర్తించారు. ఆయన కదలికలపై పక్కా ఫోకస్ పెట్టి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీజే సిద్ధార్థతో పాటు మరొక వ్యక్తికి డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు నార్కోటిక్ బ్యూరో పోలీసులు. మాదాపూర్, గచ్చిబౌలి ఏరియాల్లో నిత్యం పబ్బులకు వెళ్తున్న వారిపై ఫోకస్ పెట్టారు. 16మందిని అదుపులోకి తీసుకుని టెస్ట్ చేయగా ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇందులో ఒకరు డీజే సిద్ధార్థ్, మరొకరు స్వరూప్‌గా గుర్తించారు. కొంతకాలంగా డీజే సిద్ధార్థ్, స్వరూప్ కదలికలపై నార్కోటిక్ పోలీసులు నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిద్ధార్థ్, స్వరూప్‌తోపాటు ఇంకెవరెవరు డ్రగ్ తీసుకున్నారో దర్యాప్తు చేస్తున్నారు. మరి కొంతమంది అనుమానితులపైనా ఫోకస్ పెట్టారు.స్కూల్స్, కాలేజీల్లో డ్రగ్స్ నిర్మూలనపై చర్యలు చేపడుతున్నామని చెప్పారు తెలంగాణ నార్కొటిక్ బ్యూర్ డైరెక్టర్ సందీప్ శాండిల్య. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని?డ్రగ్స్ నిర్మూలనకు మేనేజ్మెంట్లు సహకరించాలని కోరారు. స్కూళ్లల్లో ఒక రిటైర్డ్ పోలీస్‌ను రిక్రూట్ చేసుకోవాలని సూచిస్తున్నారు. స్టూడెంట్స్ బ్యాగుల్లో ఈ-సిగరెట్స్, గంజా, లిక్కర్ బాటిల్స్ ఉంటున్నాయని.. ప్రతిరోజూ స్కూల్ బ్యాగులను చెక్ చేయాల్సిందేనని చెప్తున్నారు. విద్యాసంస్థల్లో జూనియర్లను కొంతమంది సీనియర్లు డ్రగ్స్ కోసం ఉపయోగించుకుంటున్నట్టు తమ దృష్టికొచ్చిందని.. అలర్ట్‌గా ఉండాలని యాజమాన్యాలను ఆదేశించారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్

## -పండుగను ఘనంగా జరుపుకున్న ముస్లిం సోదరులు

అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్‌ను అనంతపురం నగరంలో సోమవారం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు త్యాగానికి మారుపేరుగా నిర్వహించుకుంటారు. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే బక్రీదు పండుగకు చాలా పురాతన చరిత్ర చెబుతోంది. పూర్వకాలం ఇబ్రహీం ప్రవర్తకు సంతానం లేకపోవడంతో ఎన్నో పూజలు వల్ల అల్లా దయవల్ల ఇస్మాయిల్ అనే కుమారుడు జన్మిస్తాడని అతడు నిద్రిస్తున్న సమయంలో కత్తితో మెడపై నరికిన కాట్లు ఉండడం గల స్వప్నం రావడం ఆ విషయం తండ్రి ఇబ్రహీం చెప్పడంతో ఇబ్రహీం ఒంటెను కుర్బానీగా ఇస్తాడని అయినప్పటికీ తన కుమారుడు ఇస్మాయిల్ కు తిరిగి స్వప్నంలో మెడను నరికినట్లు రావడం జరుగుతూ ఉండటంతో చివరకు తన కుమారునితో నిన్ను అల్లాకు బలి ఇస్తానని చెప్పడంతో కుమారుడు ఇస్మాయిల్ ఒప్పుకోవడం జరిగిందని, ఈ క్రమంలో తన కుమారుడిని నరుకుతున్న సమయంలో అల్లాహ్ ప్రత్యక్షమై 'నీ త్యాగానికి నేను ముగ్దుడైయానని నీ కుమారుడిని వధించవద్దని ప్రత్యేక నెమరువే జంతువును నాకు కురుబానిగా ఇవ్వాలని' చెప్పినట్లు చరిత్ర చెబుతోంది. ఈ క్రమంలోనే ముస్లింలు కుర్బానీగా జంతువును వధించి మూడు భాగాలు చేసి ఒక భాగాన్ని పేదలకు ఇంకొక భాగాన్ని బంధువులకు మూడవ భాగాన్ని తన కుటుంబ సభ్యులు భుజించడం జరుగుతుందని చరిత్ర చెబుతున్నది. ఈ క్రమంలోనే ముస్లిం




సోదరులు బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో ఈద్గాల వద్దకు వెళ్లి ప్రార్థన నిర్వహించి మత పెద్దలు బోధించే బోధనలను విని తమ పూర్వీకుల సమాధుల వద్ద ప్రార్థనలు గావించి జంతువులను కుర్బానీ చేసి అత్యంత వైభవంగా బక్రీద్ పండుగ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు అనంతరం ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుసుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం.

## బక్రీద్ పర్వదినం సందర్భంగా

# హిందూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలోరక్తదానకార్యక్రమం

హిందూపురం టౌన్ , సూర్య వాస్తవం: అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారుఖ్ ఖాన్ ఆధ్వర్యంలో లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్ అధ్యక్షతన బక్రీద్ పర్వదినం సందర్భంగా హిందూ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలోరక్తదానకార్యక్రమం ఘనంగా జరిగింది అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారుఖ్ ఖాన్ 59 వ సారి రక్త దానం చేశారు రక్తదానం చేద్దాం ప్రాణ దాతలుగా మారుదాం కుల మతాల అడ్డు గోడల్ని కూలుద్దాం వసుధైక కుటుంబం నిర్మిద్దాం.అనే ఆచారణాత్మక ఆశయం తో తమ సామాజిక సేవా సంస్థ పని చేస్తోందని మొహమ్మద్ ప్రవక్త సందేశం ఇబ్బంది లో ఉన్న రోగుల ను పరామర్శించి వారికి సహాయ సహకారాలు అందించటం కుల మతాలకు వర్గ వర్ణాలకు అతీతంగా మత సామరస్యం పరమత సహనం వసుధైక కుటుంబ నిర్మాణం మహనీయ మొహమ్మద్ ప్రవక్త సందేశం అని అన్నారు రక్తదానం చేయండి జీవితాన్ని బహుమతి గా ఇవ్వండిఈద్ ముబారక్ బక్రీద్ సందర్భంగా ప్రసవగర్భిణీ. తలసీమియా రోగులకు. శస్త్రచికిత్సలకు షహీద్ టిప్పు సుల్తాన్ మిత్రబృందం రక్త దానం చేస్తున్నాము అని ఇప్పటి వరకు 14000 మందికి పైగా ప్రసవగర్భిణీ. తలసీమియారోగులకు. శస్త్రచికిత్సలకు రక్త హీనత బాధితుల కు దాతల ద్వారా రక్త దానం చేయించి న ఘనత అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ మానవతా రక్తదాన ఆర్గనైజేషన్ దని ఉమర్



ఫారూక్ ఖాన్ అన్నారు ఈ కార్యక్రమం లో డాక్టర్ చరణ్ డాక్టర్ జక్కా నరేంద్ర. డాక్టర్ శివ కుమార్ ఉబెదుల్లా హుసేన్. చైతన్య గంగిరెడ్డి. ఇదరీస్. మౌలానా. ఫ్రూట్ రహమాన్.రక్త దాతలు శ్రీనాథ్. దిలీప్. నాజిమ్ తదితరులు పాల్గొన్నారు రక్త దాతలకు ప్రశంసా పత్రములతో పాటు షహీద్ టిప్పు సుల్తాన్ రక్త దాత పురస్కారం అందజేశారు

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ప్రొద్దుటూరు నూతన నగర కమిటీ ఎన్నిక - ఏబివిపి

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం):స్థానిక గీతాశ్రమంలో నిర్వహించిన సమావేశంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబివిపి) నూతన ప్రొద్దుటూరు నగర కమిటీ ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వెంకటేశ్వర కళాశాల కో కోఆర్డినేటర్ పర్లపాడు గౌరి శంకర్, ఏ వో పృధ్వి నారాయణ, ఏబివిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున పాల్గొని నూతన బాధ్యతలను ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ ఈ దేశంలో 75 సంవత్సరాల నుండి విద్యార్థుల సమస్యల కోసం పని చేస్తున్న సంస్థ ఏబీవీపీ అన్నారు. ఒక క్రమశిక్షణ గల సంస్థ అన్నారు. వివేకానందుని స్ఫూర్తితో సమాజంలో పనిచేసే ఏకైక సంస్థ అన్నారు అలాగే ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో కళాశాలలో పాఠ్యపుస్తకాలను ప్రభుత్వమే ఉచితంగా పంపిణి చేయాలన్నారు. ఉచిత మధ్యాహ్న భోజన పతకాన్ని కొత్త ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఫీజుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. భాగ్ కన్వీనర్ శరణ్ నగర కార్యదర్శిగా శివ నారాయణ, నగర సహాయ కార్యదర్శులుగా శివాజీ, అభినయ్ ఎస్ ఎఫ్ డి కన్వీనర్ గా సంతోష్, సుదర్శన్ యస్ ఫ్ యస్ కన్వీనర్ గా




వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ గా సోహైల్ హాస్టల్ కన్వీనర్ గా శ్రవణ్ ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజు, తదితరులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# వై.ఎస్.ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ లో బక్రీద్ పండుగ.. అలరించిన నృత్యాలు

పులివెందుల అర్బన్, సూర్య వాస్తవం : బక్రీద్ పండుగను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం డాక్టర్ .వై.ఎస్.ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్ లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని శిల్పారామం ఏఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా పండుగ పూట అందరు ఈద్ ముభరక్ అని శుభాకాంక్షలు






చెప్పుకున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా మాస్టర్ కిషోర్, కిషోర్ డ్యాన్స్ అకాడమీ, కడప వారి శిష్య బృందంచే కోలాటం మరియు వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమం ఏర్పాట్లను శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో నృత్య శిక్షకుడు మాస్టర్ కిషోర్, పరిపాలనా అధికారి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నివాళులర్పించిన పామిడి వీర

పామిడి సూర్య న్యూస్ : పామిడి పట్టణంలో ఉన్నటువంటి చాకలి విధులు నివాసముంటున్న టువంటి రమణారెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి అందరికీ తెలిసింది విషయం తెలుసుకున్న మాజీ ఏడిసిసి చైర్మన్ వీరాంజనేయులు నివాళులర్పించి మృతదేహానికి పూలమాల ను వేసి నివాళులర్పించారు అనంతరం వీరాంజనేయులు మాట్లాడుతూ అందరిలో కలిసిమెలిసి ఉంటూ ఆప్యాయంగా పలకరిస్తూ. ఉన్నటువంటి. రమణారెడ్డి మరణించడం చాలా బాధాకరమైన విషయమని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.



Truth of News
సూర్య వాస్తవం
http://www.suryavastavam.com

# రాయలసీమ

## కడప, అనంతపురం, చిత్తూరు

### జూలై 1 నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పు పంపిణీ

కడప సూర్య వాస్తవం బ్యూరో :రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెల్లరేషన్ కార్డుదారులకు బియ్యంతోపాటు పంచదార, కందిపప్పును ఇచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో ఏడాదిగా కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. దీంతో పేదలు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో ఈనెల 12వతేదీన ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా కందిపప్పు ఇవ్వడం లేదన్న విషయం ఆయన దృష్టికి వెళ్లింది. సీఎం ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు కదిలారు. రాష్ట్రస్థాయిలో కందిపప్పును కొనుగోలు చేసి ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపారు. ఈనెల 20వతేదీ నుంచి రేషన్ షాపులకు బియ్యం, కందిపప్పు, ఆయిల్ ప్యాకెట్లు, పంచదారను సరఫరా చేయాల్సి ఉంది. దీంతో పౌరసరఫరాల శాఖ అధికారులు శనివారం ఒంగోలులోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లో దించిన చెక్కర, కందిపప్పు నాణ్యతతోపాటు అక్కడికి వచ్చిన ప్యాకెట్లను తూకం వేసి పరిశీలించారు. వచ్చేనెల 1 నుంచి వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలుస్తోంది.

### ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తా - గుమ్మనూరు ఈశ్వర్

పామిడి సూర్య న్యూస్ : ఎన్నికల సమయంలో ప్రజల కోసం ఇచ్చిన హామీలన్నీ దశలవారుగా నెరవేరుస్తామని ఎన్నికల సమయంలో చెప్పారు అ దులో భాగంగానే సోమవారం పామిడి మండలంలో వజ్రకరూరు పామిడి వరకు ఇరువైపుల చెట్లు ఉన్నందున ప్రయాణికులకు ఇబ్బంది ఉందని తెలుసుకొని గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్లు తీసివేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికల



సమయంలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జై రామ్. ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా నెరవేరుస్తాం ఏది ఏమైనా కష్టపడిన వారికి కచ్చితంగా గుర్తించి న్యాయం చేసే వరకు ఊపిరి ఉన్నంత వరకు కార్యకర్తల కోసమే పని చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ రమేష్ వెంకటేష్.ముసలి రెడ్డి శ్రీనివాసులు. కదిరప్ప తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

### అల్లా చూపిన సన్మార్గంలో నడవాలి - బక్రీద్ వేడుకలో ఇమాం


ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): ప్రతి ఒక్కరూ అల్లా చూపిన సన్మార్గంలో నడవాలని ఇమాం మేరాజ్ రజా సూచించారు. ముస్లిం సోదరుల పవిత్ర



బక్రీద్ పర్వదినం సందర్భంగా సోమవారం కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని అన్నారు. అల్లా చూపిన సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలను, గుణాలను వదిలివేయాలని తెలిపారు. కుర్బాని ప్రాముఖ్యతను, గొప్పతనాన్ని వివరించారు. భగవంతుడు చూపిన దయ, క్షేమ మార్గంలో పయణించాలన్నారు. పేదలకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. రంజాన్ తర్వాత అత్యంత ప్రాముఖ్యతగల పండుగ బక్రీద్ అన్నారు. త్యాగానికి చిహ్నంగా ఈ పండుగను నిర్వహించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీ ఇనాయతుల్లా, అంజుమన్ కమిటీ కమిటీ సెక్రటరి ఇలియాస్ ఖురేషి, వైస్ ప్రసిడెంట్ ఇలియాస్, ట్రెజర్ బాష, మత పెద్దలు పాల్గొన్నారు. పట్టణంతోపాటు పరిసరాల గ్రామాలకు చెందిన ముస్లింలు ఈ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. సినీనటుడు దావూద్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనలు ముగిసేవరకు కొర్రపాడు రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు పోలీసులు అమలు చేశారు. ప్రార్థనలు అనంతరం ముస్లింలు ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

### ఆర్థిక శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ ఆఫీసర్ సంఘం సభ్యులు పెద్దయ్య

అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) :అనంతపురం జిల్లా ఉరవకొండ ఎమ్మెల్యే, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ని 14 బెటాలియన్ అధ్యక్షులు , ఏపీ రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సంఘం సభ్యుడు పెదయ్య సోమవారం నాడు మర్యాదపూర్వకంగా కలిశారు. పయ్యావుల కేశవ్ మంత్రిగా పదవి



బాధ్యతలు తీసుకొని మొట్ట మొదటిసారిగా అనంతపురం కి విచ్చేసిన సందర్భంగా 14 బెటాలియన్ అధ్యక్షులు పెద్దయ్య పూల బొకే ఇచ్చి దృశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు పలు విషయాలపై చర్చించారు.

# చిరస్మరణీయులైన చిలకమర్తి లక్ష్మీ నరసింహం

## గణనీయమైన కీర్తి తెచ్చిన గయోపాఖ్యానం : ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

మైదుకూరు సూర్య వాస్తవం : కవి,రచయిత,నాటక కర్త, పాత్రికేయులు, సంఘసంస్కర్త, విద్యావేత్త అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం కి అఖండమైన కీర్తి తెచ్చి చిరస్మరణీయుని చేసింది ఆయన రాసిన గయోపాఖ్యాన నాటకమేనని వైయస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ లో సోమవారం చిలకమర్తి 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయస్సులో రాసిన గయోపాఖ్యానం ప్రతులు అప్పట్లోనే లక్షకు పైగా అమ్ముడుపోవడం విశేషం అన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిల్టన్ గా ప్రసిద్ధులైన చిలకమర్తి ఆ కాలంలోనే దళితులకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు.డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఆయన ఎన్ని కథలు, నవలలు, నాటకాలు,అనువాదాలు రాసిన గయోపాఖ్యానమే మంచి కీర్తి తెచ్చింది అన్నారు. సత్యనారాయణ చిలకమర్తి ఆసువుగా చెప్పిన పద్యాలనుచక్కగా ఆలపించారు. ఈ సందర్భంగా గయోపాఖ్యానం నాటకం లో ప్రసిద్ధ పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న ఆమూరు విశ్వనాథరెడ్డి,భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి



రామచంద్రయ్య, కర్నాటి నరసింహ రెడ్డి, పట్నం సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. రంగస్థల కళాకారులైన మందల మురళి, బ్యాంకు గంగయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, తపలిస్ట్ గంగయ్య, రవీంద్రనాథ్ రెడ్డి గయోపాఖ్యానం నాటకంలోని పద్యాలను మధురంగా గానం చేశారు.

# భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్న ముస్లింలు

కుప్పం సూర్య వాస్తవం : కుప్పం నియోజకవర్గంలో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.అత్తరు పూసిన దుస్తులు ధరించి ఆ సువాసన లతో మసీదు కు వెళ్లి ముస్లిం సోదరులందరూ కలసి ," అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్, లా ఇలాహా ఇల్లల్లాహు అల్లాహు అక్బర్,అల్లారు అక్బర్ వలిల్లా ఇల్హం" అంటూ తక్బీర్ పఠిస్తూ ఈద్గాకు చేరుకున్నా రు అనంతరం రెండు రకాత్ ల "ఈదుల్ అజాహ్ " వాజిబ్ నమాజ్ చదివారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ఇమామ్ బక్రీద్ పండుగ ప్రాశస్త్యం గురించి తెలియజేశారు. ఈ





సందర్భంగా ప్రపంచ మానవాళికి శుభం కలగాలని (దువా) ప్రార్థించారు.అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ పండుగలో అత్యంత ప్రాసస్థ్యం కలిగిన ఖుర్బానీని పేదలకు పంచి పెట్టారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించారు. కాగా బక్రీద్ పండుగను పురస్కరించుకుని కుప్పం నియోజకవర్గ పార్టీ సీనియర్ నేతలు పిఎస్ మునిరత్నం, డాక్టర్ బిఆర్ సురేష్ బాబు,సత్యేంద్ర శేఖర్, రాజ్కుమార్, గోపీనాథ్, తదితరులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# త్యాగానికి ప్రతిరూపం.. బక్రీద్

## త్యాగానికి ప్రతిరూపం.. బక్రీద్ - భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

కడప సూర్య వాస్తవం బ్యూరో : త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీదు పర్వదినాన్ని ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకున్నారు. నగరంలోని బిల్టప్ దగ్గర ఉన్న ఈద్గాలో వేలాది మంది ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజు చేసారు. ఒకరికొకరు పరస్పరం బక్రీదు పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం నుంచే వేలాదిగా ముస్లిం సోదరులు ఈద్గాకు తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ప్రార్థనల్లో పెద్దదర్గా పీఠాధిపతి మహమ్మద్ ఆరీఫుల్లా హుస్సేనీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు అఫ్జలాఖాన్, టీడీపీ నాయకులు అమీరాబాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దదర్గా పీఠాధిపతి మహమ్మద్ ఆరీఫుల్లా హుస్సేనీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు అమీర్ బాబు ఇతర ముస్లిం సోదరులకు బక్రీదు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మత గురువులు





మాట్లాడుతూ ఎలాంటి స్వార్థపూరిత ఆలోచనలు లేకుండా రాగద్వేషాలను వదలి మానవతను పెంపొందించాలన్నారు. అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా అయిన బక్రీదు పండుగను ముస్లిం సోదరులు ఆనందంగా, పవిత్రంగా జరుపుకునే శుభసందర్భంలో నిర్వహించే నమాజ్లో పాల్గొనడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రపంచంలో ఉన్న మానవాళి సుఖ శాంతులతో స్నేహభావంతో, త్యాగానికి ప్రతీకగా కోరుకుంటూ బక్రీదు శుభకాంక్షలు తెలుపుకుంటున్నానని అన్నారు.

# ఎస్ పిఎఫ్ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి

## - ఎస్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పైడిపల్లి కిశోర్

పులివెందుల రూరల్, సూర్య వాస్తవం: వచ్చే నెల జూలై 31వ తేదీన కడప నగరం పరిధిలోని ప్రెస్ క్లబ్ నందు స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ సభ నిర్వహించనున్నట్లు, ఈ సభను సంబంధిత ప్రతినిధులు అందరూ విజయవంతం చేయాలని ఎస్ పిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పైడిపల్లి కిషోర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీఎఫ్ అనుబంధ సంస్థలైన స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోర్స్, సొసైటీ ప్రొటెక్షన్ ఫ్రంట్, ఎస్పీఎఫ్ టీవీ ఛానల్ ఏ ఎస్ ఓ అసోసియేషన్ ఆఫ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్లో నాయకులు సభ్యులందరూ కదలి రావాలని తెలియజేశారు. ఈ సభకు జాతీయ రాష్ట్ర లలో ఉన్న ఎస్పీ ఎఫ్ అనుబంధ సంఘాల సభ్యులు నాయకులు అందరు కూడా కదిలి రావాలని పిలుపునిచ్చారు.అలాగే సంఘంలో ఉన్న సభ్యులు నిజాయితీ,నిబద్ధతతో సేవాతత్పరతో విద్యార్థుల సమస్యలు, యువతనిరుద్యోగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించాలని ఆయా రంగాలలో వస్తున్నటువంటి సమస్యలపై ఎప్పటికప్పుడు పాలకవర్గాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గాలను చూపే దిశగా పాలకవర్గాలపై ఒత్తిడి తెచ్చే విధంగా ఉద్యమ కార్యరూపం ఉం డాలని తెలిపారు. అదేవిధంగా కడప జిల్లాలోని ఉక్కు పరిశ్రమ సాధన కోసంఅన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమ ప్రణాళికలు రూపొందించాలని విభజన హామీల సాధన కోసం విస్తృత ఉద్యమాన్ని నిర్వహించుకుందామని పైడిపల్లి కిషోర్ తెలియజేశారు.

# ముఖ్యమంత్రిని కలిసిన అల్లూరి జిల్లా కలెక్టర్..



అల్లూరి సీతారామరాజు సూర్య వాస్తవం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కలిశారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనకు విచ్చేసిన ఆయన్ను కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ముందుగా పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఏర్పాటు చేసిన పోలవరం సమీక్ష సమావేశం లో కలెక్టర్ పాల్గొన్నారు.

# బక్రీద్ పర్వదినాన ప్రత్యేక ప్రార్థనలు

## -త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ





పులివెందుల , సూర్య వాస్తవం : పులివెందుల పట్టణ పరిధిలో పార్నపల్లి రోడ్డు నందు ఉన్నటువంటి ఈద్గా వద్ద మరియు పలు మసీదులలో సోమవారం బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈద్గాలలో మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు అందరూ కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అంటూ ముస్లిం సోదరులు ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ పండుగ భక్తి భావం విశ్వాసం కరుణ ఐక్యతకు సంకేతం అని, ప్రతి ఒక్కరూ సన్మార్గంలో జీవించాలనే సందేశాన్ని బక్రీద్ చాటుకుంటుందని, రాగదేశాలకు అతీతంగా అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎప్పుడు ఉండాలని, పవిత్రమైన రంజాన్ తర్వాత రెండవ అతిపెద్ద పండుగ బక్రీద్ పండుగ అని, త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగ అందరి ఇళ్లల్లో సంతోషాన్ని నింపాలని మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. అనంతరం ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈద్గా మత పెద్దలు టిడిపి నాయకులు మహబూబ్ బాషా, కాశీం, ఉమ్మర్ ,సయ్యద్ భాష, డేనియల్ బాబు, ఇతర ముస్లిం సోదరులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముక్కా వరలక్ష్మి



రైల్వే కోడూరు, సూర్య వాస్తవం: రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముస్లింలు తమపై చూపిస్తున్న అభిమానం మరువరానిదని రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ కింగ్ మేకర్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు పట్టణంలోని టిడిపి సీనియర్ నాయకులు బాబా సాహెబ్ ఆహ్వానం మేరకు ముక్కా వరలక్ష్మి బక్రీద్ పండగను పురస్కరించుకొని ముస్లింలకు అభినందనలను తెలియజేశారు. అదేవిధంగా మైసూరు వారి పల్లె పంచాయతీ పరిధిలో ఉన్న ఈద్గా స్థలాన్ని మైసూరు వారపల్లి గ్రామస్తులతోనూ ఇటు కోడూరు ముస్లింలతోనూ గత రాత్రి టిడిపి ఇన్చార్జి ముక్క రూపానంద రెడ్డి ఇరువర్గాలతో చర్చించి పూర్తిస్థాయిలో ఇరువర్గాలను ఏకం చేసినట్లు ఆమే తెలిపారు. అదేవిధంగా రానున్న రోజుల్లో ముస్లింలకు ఈద్గా మైదానాన్ని తప్పక ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. గత ఎన్నికలలో రైల్వేకోడూరు నియోజకవర్గ ఎన్నికలలో ముస్లింలు ఐకమత్యంతో పని చేశారని ఆమె అన్నారు. వారికి తెలుగుదేశం పార్టీ స్థాయిలో అండగా ఉంటామని ముక్కా వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు కరిముల్లా, రహీం,హబీబ్, అక్బర్ మహబూబ్బాషా తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లాకు మాజీ సీఎం జగన్ రాక..!

కడప సూర్య వాస్తవం బ్యూరో : కడప జిల్లాకు మంగళవారం మాజీ సీఎం జగన్ రానున్నట్లు వైసీపీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో వైసీపీ ఓటమి తర్వాత వైఎస్ జగన్ తొలిసారి సొంత జిల్లాకు రానున్నారు. మంగళవారం నుంచి నాలుగు లేదా ఐదు రోజులు పాటు ఇడుపులపాయ, కడప జిల్లాలో ఉండి కార్యకర్తలు నాయకులతో సమావేశం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.



# త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీకగా బక్రీద్



సిద్దవటం సూర్య వాస్తవం :త్యాగం, సహనం, మానవత్వానికి ప్రతీకగా బక్రీద్ (ఈద్-అల్-అధా) పండుగను నిర్వహించుకోవాలని సిద్దవటం ఇమామ్ సయ్యద్ పీర్ బాషా ఖాద్రి పిలుపునిచ్చారు. "దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ...భక్తి భావం, విశ్వాసం, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఆ అల్లాహ్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నామన్నారు. సిద్దవటం మండలంలోని సిద్దవటం, భాకరాపేట, కనుములోపల్లె, మాధవరం-1, అలీనగర్, మాచుపల్లి, వంతాటిపల్లి, ఉప్పరపల్లి తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన బక్రీద్ పండుగ విశిష్టతను వివరించారు. సంస్కృతి, సాంప్రదాయంతోపాటు సమాజ మార్పును సైతం ప్రతిబింబించే పండుగగా బక్రీద్ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సమాజ మార్పును నిర్దేశించడమే కాకుండా ముస్లిము సోదరుల ఆత్మవిశ్వాసం, నిజాయితీకి ఈ పండుగ నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ఈ పండుగను ముస్లిం సోదరులు తమ కుటుంబాలతోనే కాకుండా ఇతర మతాలకు చెందిన సన్నిహితులతోనూ కలిసి వైభవంగా జరుపుకోవడం ప్రత్యేకతగా చెప్పవచ్చునన్నారు. కుల, మతాలకతీతంగా మతసామరస్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తోందని, త్యాగానికి, దాన, ధర్మాలకు బక్రీద్ ఊతమిస్తోందన్నారు. సమాజంలో సామాజిక, ఆర్థిక సమనత్వానికి దోహదపడేలా సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి బక్రీద్ నిదర్శనంగా నిలుస్తుందన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ నిజాయితీగా నడుచుకుంటూ అభివృద్ధి చెందుతారన్నదానికి నిదర్శనంగా బక్రీద్ నిలుస్తుందన్నారు. రంజాన్ పండుగ అనంతరం 70 రోజుల తర్వాత ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం చివరి నెల అయిన జిల్‌హజ్ మాసంలో పదో తేదీన బక్రీద్ పండుగ నిర్వహించుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. ఖురాన్ ప్రకారం... అల్లాను అత్యంత ప్రీతిపాత్రంగా ప్రేమించే ఇబ్రహీం దంపతులకు ఎనభైయేళ్లు దాటినా సంతానం కలగలేదన్నారు. చుట్టుపక్కల వారు హేళన చేసేవారన్నారు. ఒకరోజు అల్లా ఇబ్రహీం కలలో కనిపించి ఇబ్రహీం.. నీకు ఏం కావాలి? అని అడుగుతారన్నారు. సంతానం కలిగించాలంటూ ఇబ్రహీం కోరడంతో కుమారుణ్ణి ప్రసాదిస్తారన్నారు. కొన్నేళ్లు కుమారుడితో కలిసి సుఖ సంతోషాలతో జీవిస్తుండగా అల్లాహ్ ఇబ్రహీం నిజాయితీని పరీక్షించేందుకు అత్యంత ఇష్టమైన దాన్ని తనకు బలి ఇవ్వాలని కోరతారన్నారు. తనకు అత్యంత ప్రీతికరమైనది తన కొడుకేనంటూ, తన వద్ద అంత విలువైనది ఏదీ లేదంటూ ఇబ్రహీం దేవుడికి విన్నవిస్తారన్నారు. తాను అల్లాహ్ కోరిక మేరకు ఒక్కగానొక్క కొడుకును సైతం బలి ఇవ్వడానికి ఇబ్రహీం సిద్ధపడతారన్నారు. ఇబ్రహీం కొడుకును బలి ఇవ్వడాన్ని భరించలేక దేవదూతలు సైతం అల్లాహ్ ను ప్రాధేయపడతారన్నారు. అనంతరం వారి సూచన మేరకు ఇబ్రహీం గొర్రె పిల్లను బలి ఇస్తారన్నారు. నాటి నుంచి నేటి వరకు ముస్లిములు అల్లాను పూజించే క్రమంలోనే గొర్రెను బలి ఇచ్చి మాంసాన్ని ఇతరులకూ వితరణ చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీన్నే అనాదిగా బక్రీద్ పండుగగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు.

**సమనత్వానికి సూచికగా...**

సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేననడానికి సూచికగా బక్రీద్ నిలుస్తుందన్నారు. నిరుపేదలు, సంపన్నులు తరతమ భేదం లేకుండా పండుగ జరుపుకోవాలన్నారు.ముస్లింలు ప్రతి ఒక్కరూ వారి వారి తాహతుకు తగ్గట్టు మేకలు, గొర్రెలు దానం చేయాలన్నారు. నిరుపేదలు ఏడుగురు కలిసి జంతువును దానం చేయాలన్నారు. ఈ విధంగా చేయడాన్ని ఖుర్బానీగా పిలుస్తారన్నారు. పండుగను ప్రతి ఒక్కరూ నిర్వహించుకునేలా ఖుర్బానీ (దానం) ఇచ్చే మేకను, గొర్రెను అందించే వారు మూడు సమపాళ్లుగా చేసి తొలుత బీదవారికి, బంధుమిత్రులకు, కుటుంబ సభ్యులకు సమపాళ్లలో అందించి సమనత్వాన్ని చాటుకోవాలన్నారు. అనంతరం ముస్లిం సహోదరులు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ ప్రత్యేక ప్రార్ధనల అనంతరం ముస్లిం సహోదరులు వారి వారి ఇండ్లకు చేరుకుని కుర్భాని చేసి మాంసాన్ని పేదలకు పంపిణీ చేశారు.

## ఉరి వేసుకుని యువకుడు మృతి



పోరుమామిళ్ల, సూర్య వాస్తవం : పోరుమామిళ్ల మండలం అక్క రెడ్డి పల్లి గ్రామ దళితవాడకు చెందిన దాసరి పల్లె ప్రేమ్ సాగర్ (20) ఉరి వేసుకుని మృతి చెందాడు. మానసిక స్థితి సరిగ్గా లేక మనస్థాపంతో గ్రామ సమీపంలో ఉన్న టెలిఫోన్ టవర్‌కి ఉరి వేసుకుని మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చేతికి అంది వచ్చిన తమ కుమారుడు మరణించడంలో తల్లిదండ్రులు రోధిస్తున్నారు. అక్కల్ రెడ్డి పల్లి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## కోలాటం గజ పూజ కార్యక్రమానికి హాజరైన టిడిపి ఇన్చార్జి ముక్కా దంపతులు



రైల్వే కోడూరు, సూర్య వాస్తవం: కోడూరు మండలం మాధవరంపోడు గ్రామస్తులు ఆహ్వానం మేరకు కోలాటం గజ పూజ కార్యక్రమానికి ఆదివారము రాత్రి ముక్కా ఫౌండేషన్ అధినేత, రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి ముక్కా రూపానంద రెడ్డి, వారి సతీమణి ముక్కా వరలక్ష్మి, దంపతులు హాజరయ్యారు. అనంతరం వారు చేతులు మీదుగా పూజా కార్యక్రమం ను టెంకాయ కొట్టి పూజా కార్యక్రమం ప్రారంభించారు.ఈ పూజా కార్యక్రమానికి ఐదు మండలాలకు సంబంధించిన నాయకులు విచ్చేసారు. ఈ కార్యక్రమంలో ముక్కారూపానందరెడ్డి కుటుంబ సభ్యులు ఉమ్మడి కూటమి జనసేన బిజెపి తెలుగుదేశం పార్టీల నాయకులు కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# విజృంభిస్తున్న దోమలు..

### చోద్యం చేస్తున్న అధికారులు - నగర వాసుల అవస్థలు



కడప సూర్య వాస్తవం బ్యూరో : కడప నగరంలోని వివిధ ప్రాంతాలలో చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారి దోమలు పెరిగిపోతున్నాయి. రాత్రి అయితే చాలు వీటివల్ల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతుంది. వీటి నివారణకు ఫాగింగ్ కూడా చేయటం లేదు. యంత్రాలు తీసుకెళ్లే ఆటోలు పాడైపోయాయి. అవి మూలకు చేరడంతో గత కొంతకాలంగా ఫాగింగ్ ప్రక్రియ నిలిపేశారు. ప్రస్తుతం నగరవ్యాప్తంగా డ్రైన్లలో పూడిక తొలగింపు పనులు సాగుతున్నాయి. పలు సమస్యలు ప్రజలను వేధిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. నగరంలోని డివిజన్ల పరిధిలోని ప్రతి ప్రాంతాల్లోనూ దోమల బెడద ఎక్కువగా ఉందని ప్రజలు వాపోతున్నారు. కొన్నిచోట్ల డ్రైన్లు పొంగి మురుగు రహదారులపై చేరుతున్న పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. పలుచోట్ల అంతంతమాత్రంగా ఉన్న డ్రైన్లలో పూడిక తొలగించకపోవడంతో మురుగు తరచుగా రోడ్లపైకి చేరుతోంది. ప్రస్తుతం నగరంలోని ప్రధాన కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపట్టిన రహదారుల ప్రక్క మేటవేసుకుపోతున్న చెత్త తరలింపకపోవడంతో ఆయా ప్రాంతాలలో దోమలు విజృంభిస్తున్నాయి. అరకొరగా ఉన్న ఫాగింగ్ యంత్రాలతో డివిజన్ల వారీగా భాగించేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

# సుస్వాగతం పలికిన కార్యకర్తలు





గుంతకల్లు , సూర్యా న్యూస్: ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఎమ్మెల్యే గుమ్మనూ రు జయరాంతోపాటు పలువురు ఎమ్మెల్యేలకి. గుంతకల్లు నియోజకవర్గం కార్యకర్తలు గుత్తిలో పామిడిలో కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం కోసం సేవకుడిలా పనిచేస్తానని పదవులు పక్కనపెట్టి కార్యకర్తలు ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే.వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే కచ్చితం గాన్యా న్యాయం జరిగేలా. చూస్తానన్నారు. కష్టపడిన వారిని పార్టీ ఎప్పటికీ గుర్తు. గుర్తుపెట్టుకుంది. గుర్తుపెట్టుకుంటుంది అన్నారు వీటన్నిటికీ. ఓపికతో ఉండి పార్టీ కోసం కష్టపడి పని చేస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కచ్చితంగా ఏం జరుగుతుందన్నారు మా గెలుపు కేవలం మేము చేసింది కాదుకార్యకర్తల కోసమే పనిచేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని ప్రపంచానికి తెలియజేసే రోజు బక్రీద్

### - దుంపలగట్టు ఈద్గాలో బక్రీద్ ప్రార్థనలో పాల్గొన్న రెడ్యం




మైదుకూరు సూర్య వాస్తవం : బక్రీద్ పండగ పర్వదిన రోజున సోమవారం ఉదయం ఖాజీపేట మండలం, దుంపలగట్టు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న దుంపల గట్టు, కొత్త పేట, చెన్న ముక్క పల్లె, కొత్త నెల్లూరు ముస్లిం సోదరులతో కలిసి వైసిపీ నేత, ఏపీఎస్ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పాల్గొని ముస్లిం సోదరులందరికీ ఈద్ -ఉల్ -ఆదా ము బారక్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని ప్రపంచానికి తెలియజేసే ఈ రోజున ముస్లిం సోదరులుఅందరూ కరుణ, సోదర భావం, సామరస్యం, త్యాగం, స్ఫూర్తి ని పెంపొందించుకోవాలని తెలియజేస్తున్నానని ఆయన పేర్కొన్నారుజీవితంలో ప్రతి సవాళ్లను జయించేందుకుబక్రీద్మీకుధైర్యం శక్తిని ప్రసాధిస్తుందనిమీకు అల్లాహ్ దయప్రేమ ఆశీర్వాదాలు ఉండాలన్నారు.మీకు జీవితంలో ఎప్పుడూ చీకటి రాకూడదని.. మీ చుట్టూ ఆనందమే నిండి ఉండాలనికోరుకుంటూ.. అల్లాహ్ దయ, ప్రేమ, కటాక్షాలు పవిత్ర బక్రీద్ సందర్భంగా ఉండాలని, మీకందరికీ కష్టాలన్నీ తొలగిపోయి, మీకలలు నెరవేర్చాలని బక్రీద్ సందర్భంగాప్రార్థించినట్లు రెడ్యం తెలియజేస్తూ ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

# సకల మత విశ్వాసాలను సంప్రదాయాలను గౌరవించాలి

### - అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ





అనంతపురం క్రైం ( సూర్య వాస్తవం) : బక్రీద్‌ను పురస్కరించుకుని సోమవారం నాడు జరిగిన వేడుకలకు అనంతపురం ఎంపీ హాజరయ్యారు. ముస్లిమ్ మత పెద్దలు, మాజీ గ్రంథాలయ చైర్మన్ సాలార్ భాష, టీడిపి మైనారిటీ నాయకులు ఐ.ఏం.ఏం మహబూబ్ బాషా పలువురు ముఖ్య నేతలతో కలిసి అనంతపురం నగరంలోని స్థానిక హెచ్. ఎ ల్. సి కాలువ పక్కన ఉన్న ఈద్గా, జామి యా మసీదులో బక్రీద్ వేడుకల్లో పాల్గొని నమాజ్‌లు చేసి.. ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం మైనారిటీ నాయకులు పూల మాల వేసి శాలువాతో సత్కరించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గుణాల్లోనూ దానగుణమే ఉత్తమమైనదని ఆకలి అనేది అందరికీ సమానమైంది కాబట్టి ధర్మం అంటే దానగుణం ముడిపడి ఉన్నదే మానవ ధర్మం అని మతం ఏదైనా మానవత్వం గొప్పదని అన్నారు. సకల మత విశ్వాసాలను సంప్రదాయాలను గౌరవిస్తూ రాష్ట్రంలో, దేశంలో పాలన కొనసాగాలని పేర్కొన్నారు.

# రవీంద్ర నగర్ లో ప్రజలకు తప్పిన ప్రమాదం

### కొంతమంది ప్రజలు నిర్లక్ష్యం - అధికారుల నిర్లక్ష్యం



కడప, సూర్య వాస్తవం: కడప నగరం రవీంద్ర నగర్ రాజు కల్యాణ మండపం సమీపంలో ఉన్న వీధిలో ఓ టెంకాయ చెట్టు విద్యుత్ తీగలు పైన పడి పోలు నుజ్జు అయి బిల్డింగ్ పైన తగిలి ఉండి ఆ బిల్డింగ్ లేకుండా ఉంటే పోలు కింద పడి ప్రజలకు చాలా ప్రమాదం జరిగే అవకాశం ఉనింది, ఇది జరిగే సాయంత్రం ఐదు గంటలకి జరిగి ఉంటే అప్పటినుంచి ఏ అధికారి పట్టించుకోలేని పరిస్థితి కనబడింది, అప్పటినుంచి కరెంట్ లేకుండా ఆ వీధిలో ఉన్న ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇది అంతా అధికారులు ముగించకుండా దీని ఖర్చు వస్తుంది ఎవరు ఇస్తారు? ఇది ప్రభుత్వమే పెట్టుకొని చేసుకోవాలి ప్రజల నుంచి ఎటువంటి నష్టం కాలేదు ఒకవేళ ప్రజలు చేసి ఉంటే అక్కడ ఉన్న వీధి ప్రజలు అంత ఇంతో వేసుకొని చేయించుకున్న వాళ్లే,ఇది అంతా చూడకుండా అక్కడ ఉన్న 41 డివిజన్ ఇంచార్జ్ అఫ్జల్ త్వరగా అధికారులకు ఫోన్ చేసి త్వరగా పని మొదలు పెట్టడం జరిగింది.

# కారును ఢీ కొన్న పెద్ద పులి

నెల్లూరు, ( సూర్య వాస్తవం) : శ్రీపొట్టి శ్రీరాములు జిల్లాలో షాకింగ్ ఇన్సిడెంట్ వెలుగుచూసింది. మర్రిపాడు మండలం కదిరినాయుడుపల్లె సమీపంలో నెల్లూరు-ముంబై హైవేపై వేగంగా ప్రయాణిస్తున్న కారును పెద్దపులి ఒక్కసారిగా ఢీకొట్టింది. ఊహించని ఈ పరిణామంతో అందులోని ప్యాసింజర్స్ కంగుతిన్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. బద్వేలుకు చెందిన ఐదుగురు కారులో నెల్లూరు ప్రయాణిస్తున్నారు. కదిరినాయుడుపల్లె ఫారెస్ట్ ఏరియాలో పెద్దపులి రోడ్డు దాటే క్రమంలో ఒక్కసారిగా కారును ఢీకొట్టింది. కారు వేగంగా వస్తుండటంతో పులిని కొంతదూరం ఈడ్చుకెళ్లింది. అనంతరం డ్రైవర్ శ్రీనివాసులు అలెర్ట్గై సడన్ బ్రేక్ వేశాడు. కారు కొంతదూరం ఈడ్చుకెళ్లడంతో పెద్దపులి కాళ్లకు తీవ్రగాయాలయినట్లు చెబుతున్నారు. ప్రమాదం తర్వాత సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది పులి.ఊహించని ఈ ఘటనతో కారులోని ఐదుగురూ షాక్ తిన్నారు. భయంతో గావు కేకలు పెట్టారు. డోర్లు మొత్తం మూసి ఉండటంతో.. ఎలాంటి హాని వారికి జరగలేదు. ప్రస్తుతం వారంతా సేఫ్‌గానే ఉన్నారు. ఈ ప్రమాదంతో కారు ముందుభాగం ధ్వంసమైంది. స్థానికులు అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో.. వారు స్పాట్‌కు చేరుకుని వివరాలు అడిగి తెలిసుకున్నారు. పులి పరిస్థితిని తెలుసకునేందుకు ఫారెస్ట్‌లోకి వెళ్లి కూంబింగ్ చేయనున్నట్లు తెలిపారు. పెద్దపులి సంచారం గురించి తెలియడంతో? మర్రిపాడు మండలంలోని అటవీప్రాంత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# సినిమా

## రంభను రిజెక్ట్ చేసిన స్టార్ హీరో.. కోపంతో ఆమె ఏం చేసిందంటే..



స్టార్ హీరోయిన్స్ కు పోటీ ఇస్తూ తన నటనతో ఆకట్టుకుంటూ అవకాశాలు అందుకుంది రంభ. అల్లరి ప్రేమికుడు, అల్లుడా మజాకా, బావగారూ బాగున్నారా, ఒకానొక టైంలో స్టార్ హీరోయిన్ గా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించిన హీరోయిన్స్ లో రంభ ఒకరు. ఆ ఒక్కటీ అడక్కు సినిమా ద్వార పరిచయం అయ్యింది రంభ. అందంతో పాటు నటనతో ప్రేక్షకులను మెప్పించింది ఈ బ్యూటీ. ఈ ముద్దుగుమ్మ అందనికి కుర్రకారు ఫిదా అయ్యారు. స్టార్ హీరోయిన్స్ కు పోటీ ఇస్తూ తన నటనతో ఆకట్టుకుంటూ అవకాశాలు అందుకుంది రంభ. అల్లరి ప్రేమికుడు, అల్లుడా మజాకా, బావగారూ బాగున్నారా, బొంబాయి ప్రియుడు లాంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ భాషల్లో సినిమాలు చేసింది ఈ అమ్మడు. హీరోయిన్ గానే కాదు స్పెషల్ సాంగ్స్ లోనూ స్టెప్పులేసి అదరగొట్టింది. దేశముదురు, యమదొంగ, నాగ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. దాదాపు అందరు స్టార్ హీరోలతో రంభ నటించింది.. కానీ ఒక్క హీరో మాత్రం రంభ నటించలేదు. తెలుగులో దాదాపు టాప్ హీరోలతో జోడీ కట్టింది ఈ బ్యూటీ. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ సరసన రంభ నటించింది. కానీ అక్కినేని నాగార్జున సరసన మాత్రం రంభ నటించలేదు. అందుకు కారణం ఈ ఇద్దరి మధ్య జరిగిన ఓ గొడవ అని తెలుస్తోంది. అప్పట్లో కింగ్ నాగార్జున పక్కన నటించడానికి చాలా మంది హీరోయిన్ ఇంట్రెస్ట్ చూపించే వారు. రమ్యకృష్ణ, సౌందర్య, టబు, మీనా ఇలా చాలా మంది నాగార్జున తో నటించడానికి క్యూ కట్టేవారు. కానీ రంభ మాత్రం నాగ్ తో స్క్రీన్ షేర్ చేసుకోలేదు.ఎన్ని ఆఫర్స్ వచ్చినా కూడా ఆమె నాగ్ తో సినిమా చేయలేదట. ఇంతకు రంభకు నాగ్ కు మధ్య గొడవ ఏంటంటే.. నాగార్జున కెరీర్ లో బిగెస్ట్ హిట్ గా నిలిచిన సినిమాల్లో హలో బ్రదర్ సినిమా ఒకటి. ఈవీవీ సత్యనారాయణ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నాగార్జున డ్యూయల్ రోల్ లో నటించారు. నాగ్ సరసన రమ్యకృష్ణ, సౌందర్య హీరోయిన్స్ గా చేశారు. అయితే ఈ సినిమాలో రమ్యకృష్ణ ప్లేస్ లో ముందుగా దర్శకుడు రంభను అనుకున్నారట. ఆమెను కన్ఫర్మ్ చేసి డేట్స్ కూడా బుక్ చేశారట. కానీ నాగార్జున రమ్యకృష్ణ హీరోయిన్ గా కావాలని పట్టుబట్టడంతో రంభను తొలగించి రమ్యకృష్ణను తీసుకున్నారట.ఇక ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అప్పట్లోనే భారీగా కలెక్ట్ చేసింది.

## విడాకులు తీసుకోవడంలో తప్పులేదు.. హీరోయిన్ సదా అలా అనేసిందేంటీ..!



జయం సినిమాతో సినిమా ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టింది అందాల భామ సదా. తేజ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. అప్పట్లో ఈ సినిమా సెన్సేషన్ క్రియేట్ చేసింది. అందమైన ప్రేమకథగా తెరకెక్కిన ఈ సినిమాలో నితిన్ హీరోగా నటించాడు. అలాగే గోపీచంద్ విలన్ గా నటించి మెప్పించాడు. ఈ సినిమాలో తన నటనతో ప్రేక్షకులను మెప్పించింది సదా. జయం సినిమా తర్వాత సదా వరుసగా ఆఫర్స్ అందుకుంది. తెలుగులో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పించింది. తక్కువ సమయంలోనే సదా స్టార్ హీరోయిన్ గా దూసుకుపోయింది. యంగ్ హీరోల దగ్గర నుంచి స్టార్ హీరోల వరకు చాలా సినిమాల్లో నటించింది ఈ చిన్నది. తన నటనతో పాటు అందంతోనూ ఆకట్టుకుంది ఈ అమ్మడు. తెలుగుతోపాటు తమిళ్ లోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది. శంకర్ దర్శకత్వంలో వచ్చిన అపరిచితుడు సినిమాలో నటించి భారీ హిట్ అందుకుంది. అపరిచితుడు సినిమాలో తన నటనతో అక్కడి ప్రేక్షకులకు దగ్గరయింది. ప్రస్తుతం సదా సినిమాలు తగ్గించింది. పలు టీవీ షోల్లో పాల్గొంటుంది ఈ చిన్నది. ఇదిలా ఉంటే ఈ అమ్మడి వయసు పెరుగుతున్నా తరగని అందంతో కవ్విస్తుంది. అయితే సదా ఇంతవరకు పెళ్లి చేసుకోలేదు. తాజాగా సదా పెళ్లి గురించి షాకింగ్ కామెంట్స్ చేసింది. విడాకులు తీసుకోవడంలో తప్పులేదు అంటుంది సదా. "ఇప్పుడు నేను స్వేచ్ఛగా ఉన్నాను, నాకు నచ్చిన పని చేసుకుంటున్నాను. ఈ ఫ్రీడమ్ ను నేను పోగొట్టుకోవాలనుకోవడంలేదు. ఇప్పటివరకు తనకు నచ్చిన వ్యక్తి దొరకలేదు అని.. అందుకే పెళ్లి చేసుకోవాలనే ఫీలింగ్ కలగలేదు అని చెప్పుకొచ్చింది సదా. అలాగే అరేంజ్డ్ మ్యారేజ్ కాన్సెప్ట్ కి వ్యతిరేకమని తెలిపింది. అస్సలు పరిచయం లేని వ్యక్తిని ఎలా పెళ్లి చేసుకుంటారు.? ఎలా కలిసి ఉంటారో నాకు అర్థం కావడం లేదు అని తెలిపింది. పెళ్లి చేసుకుంటే లవ్ మ్యారేజ్ చేసుకుంటానని తెలిపింది. తన పేరెంట్స్ ది కూడా లవ్ మ్యారేజ్ అని తెలిపింది. అలాగే పెళ్లి చేసుకున్న తర్వాత లైఫ్ సాగడం కష్టంగా ఉందని భావిస్తే.. పార్టనర్‌తో జర్నీ చాలా కష్టంగా అనిపిస్తే.. భరించలేకపోతే విడాకులు తీసుకోవడంలోనూ తప్పులేదు అంటుంది సదా. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

# ఆరోగ్యం

## దాల్చిన చెక్కతో చేసిన టీ తాగడం వల్ల మధుమేహులకు కలిగే ప్రయోజనాలు



మధుమేహం ఉన్నవారు తమ దినచర్యలో చేర్చుకోవాల్సిన టీ ఏదైనా ఉంది అంటే..అది దాల్చిన చెక్క టీ. ఈ అద్భుత మసాలా రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడానికి, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడానికి, కడుపులో మంటను నియంత్రిస్తుంది. ఆహార జీర్ణక్రియను ఉత్తేజపరి చేందుకు, జీవక్రియను వేగవంతం చేయడానికి, బరువు తగ్గడంలో దాల్చిన చెక్క టీ అద్భుతంగా సహాయపడుతుంది. రాత్రి భోజనం తర్వాత దాల్చిన చెక్కతో తయారు చేసిన టీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మెటబాలిక్ సింద్రోమ్‌ను నివారిస్తుంది. ఫ్లేక్ ఆకలిని తగ్గించడంలో కూడా ప్రభావవంతంగా ఉంటుంది. దాల్చిన చెక్క టీ ప్రయోజనాలు మరి ఇక్కడ తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ: దాల్చిన చెక్కలో సిన్నమాల్డిహైడ్‌తో సహా బయోయాక్టివ్ సమ్మేళ నాలు ఉన్నాయి. ఇవి ఇన్సులిన్ ప్రభావాలను అనుకరిస్తాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇన్సులిన్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కీలక పాత్ర పోషించే హార్మోన్. ఇది శక్తి ఉత్పత్తి కోసం రక్తప్రవాహం నుండి కణాలలోకి గ్లూకోజ్‌ను తీసుకోవడాన్ని సులభతరం చేస్తుంది. ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచడం ద్వారా, రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత ఈ టీ తాగితే మంచిది. కార్బోహైడ్రేట్ శోషణ మందగించడం: జీర్ణవ్యవస్థలో కార్బోహైడ్రేట్లు విచ్ఛిన్నమయ్యే రేటును దాల్చిన చెక్క టీతో నెమ్మదిస్తుంది. ఇది భోజనం తర్వాత గ్లూకోజ్ ప్రసరణలోకి నెమ్మదిగా విడుదల కావడానికి దారితీస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెరగకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు: ఫ్లేక్‌లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. దీర్ఘకాలికంగా అధిక రక్త చక్కెర స్థాయిలు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచుతాయి, ఇది వాపు, కణజాల నష్టాన్ని కలిగి స్తుంది. ఫ్లాక్స్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఈ ప్రభావాలలో కొన్నింటిని తగ్గించడంలో సహాయపడతాయి, మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహిస్తాయి. **శోథ నిరోధక ప్రభావాలు:** యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలున్న దాల్చిన చెక్కను టీలో యాడ్ చేసుకుని తాగడం వల్ల కడుపులోని మంటను తగ్గిస్తుంది. యూరిన్ వేడి వల్ల కలిగే అసౌకర్యాన్ని కంట్రోల్ చేస్తుంది. రోజుకు ఒక చిన్న దాల్చిన చెక్క నమిలినా కూడా పొట్టను ఆరోగ్యంగా ఉంచుతుంది. అలాగే జీర్ణసమస్యలను నివారిస్తుంది. ఫంగల్ ఇన్ఫెక్షన్లను దూరం చేస్తుంది. ప్రొబయోటిక్ లక్షణాలు కలిగి ఉండే ఈ చెక్క కడుపులో మంచి బ్యాక్టీరియా వృద్ధిని ప్రోత్సహిస్తాయి. పొట్టను చల్లబరచడానికి.. అలాగే కడుపులో ఉత్పత్తయ్యే యాసిడ్ స్థాయిలను తగ్గించడా నికి ఉపయోగపడుతుంది.

## పనసపండుతో పండంటి ఆరోగ్యం..!



ఇది దృష్టిని మెరుగుపరచడానికి, కంటి చూపు సమస్యలను నిరోధించడానికి, కంటి సమస్యలను తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. జాక్‌ఫ్రూట్‌లో ఎముకలకు అవసరమైన మెగ్నీషియం, కాల్షియం ఉన్నాయి. జాక్‌ఫ్రూట్ ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, ఆరోగ్య సమస్యలను నివారించడానికి, బోలు ఎముకల వ్యాధి వంటి ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మనం ఇష్టంగా తినే పండ్లలో పనస పండు ఒకటి. ఈ పనస పండు సంపూర్ణమైన, బలవర్ధకమైన ఆహారం. ఈ తీపి, రుచికరమైన పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంది. ఇందులో విటమిన్ ఎ, సి, బి6తో పాటు థియామిన్, రిబోఫ్లానిన్, నియాసిన్, క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, సోడియం, జింక్, ఫైబర్‌ను సమృద్ధిగా కలిగి ఉంది. జాక్‌ఫ్రూట్‌లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జాక్‌ఫ్రూట్ విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, కాల్షియం, ఐరన్, జింక్, మెగ్నీషియం, ఇతర ఖనిజాలతో సమృద్ధిగా ఉండే పండు. జాక్‌ఫ్రూట్‌లో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. జాక్‌ఫ్రూట్ బరువు తగ్గడానికి ఉత్తమమైన పండ్లలో ఒకటి. ఎందుకంటే ఇందులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది ఆహార కోరికలను తగ్గిస్తుంది. బరువు తగ్గడానికి దారితీస్తుంది. జాక్‌ఫ్రూట్‌లో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాధులు, ఇన్ఫెక్షన్లు, వైరస్లతో పోరాడటానికి శరీరాన్ని అనుమతిస్తుంది. జాక్‌ఫ్రూట్‌లో రకరకాల ఫైటోన్యూట్రియెంట్స్ ఉంటాయి. ఇందులో విటమిన్ సి, కెరోటినాయిడ్స్, పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో ఆరోగ్యాన్ని సమర్ధవతంగా రక్షించడంలో, వైరల్ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గించడంలో జాక్‌ఫ్రూట్ ఉపయోగపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. జాక్‌ఫ్రూట్‌లో విటమిన్ ఎ, సి అధికంగా ఉండటం వల్ల కంటి ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఇది దృష్టిని మెరుగుపరచడానికి, కంటి చూపు సమస్యలను నిరోధించడానికి, కంటి సమస్యలను తొలగించే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. జాక్‌ఫ్రూట్‌లో ఎముకలకు అవసరమైన మెగ్నీషియం, కాల్షియం ఉన్నాయి. జాక్‌ఫ్రూట్ ఎముకలు, కండరాలను బలోపేతం చేయడానికి, ఆరోగ్య సమస్యలను నివారించడానికి, బోలు ఎముకల వ్యాధి వంటి ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

# క్రీడలు

## నేను, సమైరా.. అతడి నుంచే క్రమశిక్షణ నేర్చుకుంటున్నాం



టీ20 ప్రపంచ కప్ కోసం రిజర్వ్ ట్రావెల్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ యూఎస్ఏ నుంచి స్వదేశానికి చేరుకున్నాడు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగానే అతడిని వెనక్కి పిలిచినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి. వాటిని భారత బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ ఖండించాడు. కరేబియన్‌లో మ్యాచ్‌లు ఆడే సమయానికి ఇద్దరు రిజర్వు ఆటగాళ్లను మాత్రమే ఉంచాలని మేనేజ్‌మెంట్ ఎప్పుడో నిర్ణయించిందని రాథోడ్ స్పష్టంచేశాడు. తాజాగా శుభ్‌మన్ గిల్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్టు పెట్టాడు. రోహిత్ శర్మతోపాటు అతడి కుమార్తె సమైరాతో దిగిన ఫొటోను గిల్ షేర్ చేశాడు. "సమైరా, నేను ఓ వ్యక్తి నుంచి క్రమశిక్షణ నేర్చుకుంటున్నాం. అతడే రోహిత్ శర్మ" అని క్యాప్షన్ జోడించాడు. ఐపీఎల్ ముగిసిన తర్వాత భారత వైస్ కెప్టెన్ హార్దిక్ పాండ్య కుటుంబంలో వివాదాలు తలెత్తాయని.. తన భార్యతో విడాకులు తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అవన్నీ రూమర్లేనని కొట్టిపడేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా హార్దిక్ పాండ్య స్పెషల్ పోస్టు పెట్టాడు. తన కుమారుడు అగస్త్యతో ఉన్న ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. "నా జీవితంలోకి ప్రేమ, సంతోషం తీసుకొచ్చినందుకు థాంక్యూ. నువ్వు గర్వపడే తండ్రిగా ఉండేందుకు నిరంతరం శ్రమిస్తా" అని క్యాప్షన్ ఇచ్చాడు. ప్రస్తుతం హార్దిక్ టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. మూడు మ్యాచుల్లో ఏడు వికెట్లు పడగొట్టాడు.

## 'చిన్న' దెబ్బ.. 'పెద్ద' గాయం







20 జట్లతో టీ20 ప్రపంచకప్ మొదలవుతుంది అనగానే సూపర్-8 చేరే జట్లేవో అభిమానులు ముందే ఊహించుకుని ఉంటారు. ఎందుకంటే లీగ్ దశలో ఉన్న పసికూనలను చూస్తే పెద్ద జట్లు తేలిగ్గా ప్రపంచకప్‌లో రెండో రౌండ్ చేరతాయని అనిపించింది. కానీ అనూహ్యంగా మూడు పెద్ద జట్లు కనీసం తొలి రౌండ్‌ను అధిగమించకపోగా చిన్న జట్లు ముందుకెళ్లి సంచలనం సృష్టించాయి! అలా తొలి రౌండ్లోనే ఇంటిముఖం పట్టిన జట్లు న్యూజిలాండ్, పాకిస్థాన్, శ్రీలంక అయితే.. అనూహ్య విజయాలతో తొలిసారి ఓ మెగా టోర్నీలో రెండో రౌండ్ చేరిన జట్లు అఫ్గానిస్థాన్, అమెరికా. ఈ టోర్నీలో తొలి రౌండ్లోనే పాకిస్థాన్, శ్రీలంక వెనుదిరగడం కంటే న్యూజిలాండ్ ఇంటి ముఖం పట్టడమే అన్నిటికంటే పెద్ద షాక్. ఐసీసీ టోర్నీ అంటే ఏదో పూనకం వచ్చినట్లు ఆడేసే న్యూజిలాండ్ ఈసారి అనూహ్యంగా చతికిలబడింది. ప్రపంచకప్‌లో ఎంతో బలమైన రికార్డు ఉన్న కివీస్ స్థాయికి తగ్గ ప్రదర్శనే చేయలేదు. టోర్నీ ఏదైనా కనీసం నాకౌట్‌కు వెళ్లే న్యూజిలాండ్ ఈసారి పసికూన మాదిరిగా ఆడింది. అఫ్గానిస్థాన్‌తో మ్యాచే ఇందుకు ఉదాహరణ. బలమైన బ్యాటింగ్ లైనప్ ఉండి కూడా తనతో పోల్చుకుంటే బలహీనమైన అఫ్గాన్ చేతిలో కివీస్ 75 పరుగులకే ఆలౌటై ఆ పై ఓడిపోవడం ఈ టోర్నీలోనే పెద్ద సంచలనం. టోర్నీ తొలి మ్యాచ్‌లోనే తగిలిన ఈ దెబ్బ న్యూజిలాండ్‌ను కోలుకోనీయకుండా చేసింది. ఆ తర్వాత వెస్టిండీస్ చేతిలోనూ ఆ జట్టుకు పరాభవం తప్పలేదు. బౌలింగ్‌లో గొప్పగా రాణించినా.. ఆఖర్లో పట్టు విడిచి పరుగులు ఇచ్చేయడం ఆ జట్టును ముంచింది. రుథర్‌ఫర్డ్ ఎడాపెడా బాది విండీస్‌కు పోరాడే స్కోరు సాధించిపెట్టగా.. ఆ తర్వాత కరీబియన్ జట్టు తెలివిగా బౌలింగ్ చేసి కివీస్‌ను కట్టడి చేసింది. ఈ ఓటమే ఆ జట్టుకు సూపర్-8 అవకాశాలను క్లిష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ప్రపంచ క్రికెట్లో తన ముద్ర వేస్తూ వచ్చిన అఫ్గాన్.. ఓ పెద్ద టోర్నీలో తొలిసారి రెండో రౌండ్లోకి దూసుకెళ్లి సత్తా చాటింది.

## మా నిష్క్రమణకు నాదే బాధ్యత..




టీ20 ప్రపంచ కప్ నుంచి ఆసియా దేశం శ్రీలంక లీగ్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది. గ్రూప్-లో దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ చేతుల్లో ఓడిపోయిన లంకకు అప్పుడే సూపర్-8 అవకాశాలు సన్నగిల్లాయి. నేపాల్‌తో మ్యాచ్ రద్దు కావడం మరింత దెబ్బ కొట్టింది. చివరి మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను ఓడించినా నామమాత్రమే కావడంతో శ్రీలంక ఇంటిముఖం పట్టక తప్పలేదు. తమ ఓటమికి పూర్తి బాధ్యత తనదేనని శ్రీలంక కెప్టెన్ హసరంగ స్పష్టం చేశాడు. నెదర్లాండ్స్‌తో విజయం అనంతరం హసరంగ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. మ్యాచ్‌ల కోసం ఎక్కువగా ప్రయాణాలు చేయడం కూడా తమపై ప్రభావం చూపిందని వ్యాఖ్యానించాడు. "మేం తొలి మ్యాచ్‌ను న్యూయార్క్ వేదికగా ఆడాం. అక్కడ ఓడిపోయాం. తర్వాత డల్లాస్‌కు చేరుకుని ఆడాల్సి వచ్చింది. పిచ్ పరిస్థితులకు త్వరగా అడ్జస్ట్ కాలేదు. కారణాలు ఏమైనా సరే కెప్టెన్‌గా మా ఓటమికి నాదే పూర్తి బాధ్యత. పరాజయంపాలైనప్పుడు మనం పిచ్‌లపైనే నెపం మోపేస్తాం. కానీ, ప్రొఫెషనల్ క్రికెటర్‌గా అలా చేయను. ఇతర జట్లూ ఇదే పిచ్‌లపై మ్యాచ్‌లను ఆడాయి. మనం ఎంత త్వరగా అడ్జస్ట్ అయ్యామనేది కీలకం. దేశం తరఫున భారీ టోర్నీలో ప్రాతినిధ్యం వహించడం గర్వకారణం. ఇతర అంశాలను కారణంగా చూపకుండా.. మా జట్టులోని లోటుపాట్లపై దృష్టిసారిస్తాం" అని హసరంగ తెలిపాడు.

IRS PUBLICATIONS, 13-2-819-2, RAMBO RESIDENCE, RTC BUS STAND ROAD, SRINIVAS NAGAR, ANANTAPUR ANANTAPUR, ANDHRA PRADESH, 515001 GSTIN: 37AAJFI5233N1ZY TEL:7672042522 - EDITOR : M. IRSHADBEG - CELL - 918500425222.